


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 340 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 10 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :340 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 10 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

- రాజమండ్రి రోడ్డు ప్రమాద బాధితురాలు, మెడికో ప్రియాంక చికిత్స పొందుతూ కన్నుమూత
- సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచిన వైనం
- మరణాన్ని ధ్రువీకరించిన వైద్యులు
- ప్రమాదానికి కారణమైన ఇద్దరు నిందితులు ఇప్పటికే అరెస్ట్

**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఓ వైద్యురాలిగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రియాంక అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3వ తేదీన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని ప్రసాదిత్యమాల్ ప్రాంతంలో ప్రియాంక తన స్కూటర్‌పై వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపిన సురవరపు దశ్వంత్,

- మిగతా 2లో



## కాన్వాయ్ ఆపి.. ప్రకాశం బ్యారేజీని పరిశీలించిన సీఎం చంద్రబాబు

- విజయవాడలో ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు
- తిరిగి ఉండవల్లి వెళుతూ ప్రకాశం బ్యారేజి వద్ద ఆగిన వైనం
- డెల్టా ఆయకట్టుకు 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్న అధికారులు
- పట్టిసీమ జలాలతో కృష్ణా డెల్టాకు నీటి కొరత తీరిందన్న ముఖ్యమంత్రి

- మిగతా 2లో

## ప్రియాంక మృతి తీవ్రంగా కలచివేసింది.. నిందితులకు కఠిన శిక్షలు తప్పవు:



**పెన్ పవర్ డెస్క్:**రాజమండ్రిలో యువకుల తీవ్ర నిర్లక్ష్యం, మద్యం మత్తు కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని, ఎంతో భవిష్యత్ ఉన్న ఒక యువ వైద్యురాలు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆయన అన్నారు. ఈ దుర్ఘటనపై స్పందించిన

- మిగతా 2లో

## ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు..
## ఉత్సాహంగా ధింసా స్టెప్పులేసిన సీఎం

- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- గిరిజన మహిళలతో కలిసి ధింసా నృత్యం, డప్పు కొట్టి అలరించిన సీఎం
- దేశానికి ఉన్నట్టే ప్రతి పౌరుడికీ వ్యక్తిగత విజన్ ఉండాలని పిలుపు
- 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే తన సంకల్పమని స్పష్టం చేసిన చంద్రబాబు
- నిబద్ధతతో పనిచేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్ఘాటన



**పెన్ పవర్ డెస్క్:**అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ వారితో మమేకమయ్యారు. డప్పు వాయిస్తూ, ధింసా నృత్యకారులతో కలిసి అడుగులు వేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. ఆదివారం విజయవాడలోని అంబేడ్కర్ కళావేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన చంద్రబాబుకు గిరిజన మహిళలు, మంత్రి సంధ్యారాణి, ఇతర నేతలు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ ధింసా నృత్యం, డప్పు వాయిద్యాల నడుమ సీఎం వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా డప్పు చేతబట్టి వాయించి సభలో కొత్త ఉత్తేజం నింపారు.అంతకుముందు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముఖ్యమంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ప్రతి పౌరుడూ దేశం, రాష్ట్రం, గ్రామం, కుటుంబం కోసం ఓ సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సంప్రదాయాలను కాపాడుతున్న గిరిజనులకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సాధిస్తారని కొనియాడారు. సామాన్య ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి స్థాయికి ఎదగడమే దీనికి నిదర్శనమని గుర్తుచేశారు. "మన సంకల్పమే మనకు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చి ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, ప్రధాని మోదీ వంటి ఎందరో సామాన్యులే సంకల్ప బలంతో అసాధారణ విజయాలు సాధించారు" అని చంద్రబాబు అన్నారు. "నేను, నా దేశం, నా రాష్ట్రం అనే భావనతో ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్

- మిగతా 2లో



## దామచర్ల తానే రాజు తానే మంత్రి అనుకుంటున్నారు

- ఒంగోలులో టీడీపీ, జనసేన నేతల మధ్య ముదిరిన వివాదం
- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై జనసేన నేత బాలినేని తీవ్ర ఆరోపణలు
- ఇసుక, మైనింగ్, వైన్‌లో ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నాయని ఆరోపణ
- సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని విచారణ జరపాలని డిమాండ్
- పొత్తు ధర్మం వల్లే ఇంతకాలం ఓపిక పట్టామని, ఇక చూస్తూ ఊరుకోబోమని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**అధికార కూటమిలోని భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన మధ్య ప్రకాశం జిల్లా ఒంగోలులో విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఒంగోలు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డి వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వైరం ముదిరింది. తాజాగా ఎమ్మెల్యే

- మిగతా 2లో

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ..
## రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత

- నల్లబెల్లిలో దివంగత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ
- హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం చెక్కులు అందజేత
- సుదర్శన్‌రెడ్డితో అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగం
- పార్టీ అండగా ఉంటుందని కుటుంబానికి భరోసా

**పెన్ పవర్ డెస్క్:**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి పార్టీ

- మిగతా 2లో





## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం..
## సరికొత్త కారిడార్‌పై భారీ ప్లాన్!

- భారత్‌తో రైల్వే కనెక్టివిటీ ఏర్పాటుకు రష్యా ప్రయత్నాలు
- హిందూ మహాసముద్రానికి ప్రత్యామ్నాయ భూమార్గంపై దృష్టి
- తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాక్ మీదుగా మార్గం పరిశీలన
- కీలక సముద్ర జలసంధులపై ఆధారపడటం తగ్గించుకోవడమే లక్ష్యం
- ప్రతిపాదన ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని స్పష్టం చేసిన రష్యా

**పెన్ పవర్ డెస్క్:**భారత్‌తో నేరుగా రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసి, తద్వారా హిందూ మహాసముద్రానికి భూమార్గం ద్వారా చేరుకునే అవకాశాలపై రష్యా అన్వేషిస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుపై మాస్కో తీవ్రంగా దృష్టి సారించిందని, ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ ప్రణాళికను పరిశీలిస్తున్నామని రష్యా ఉప ప్రధాని

- మిగతా 2లో

## ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దు...
## ఇరాన్‌పై దాడుల కోసమేనా.?

**పెన్ పవర్ డెస్క్:**ఇజ్రాయెల్ లో సైనికులకు ఉన్న అన్ని సెలవుల ను ఆ దేశ ఆర్మీ రద్దు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్న వారు వెంటనే తిరిగి సైన్యంలో చేరాలని ఆదేశాలు జారీ చేసింది.

- మిగతా 2లో



## బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ..
## కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!

- ఆపరేషన్ సింధూర్‌తో బ్రహ్మోస్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్
- పాక్ వద్ద ఉన్న చైనా ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను విజయవంతంగా ఛేదించిన క్షిపణి
- వియత్నాం, ఇండోనేషియాతో వందల మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు ఖరారు
- పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా దేశంలోని నాలుగు కేంద్రాల్లో ఉత్పత్తి వేగవంతం
- భవిష్యత్తులో జలాంతర్గత, సూక్ష్మ వేరియంట్ల అభివృద్ధిపై శాస్త్రవేత్తల దృష్టి

**పెన్ పవర్ డెస్క్:**భారత అమ్ములపొదిలోని బ్రహ్మోస్ సూ పర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణికి అంతర్జాతీ యంగా గిరాకీ అమాంతం పెరిగింది. ముఖ్యంగా, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఈ క్షిపణి చూపిన అద్భుతమైన పనితీరు, దాని కచ్చితత్వం, విధ్వంసక శక్తి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించాయి. ఈ ఆపరేషన్ తర్వాత బ్రహ్మోస్ కొనుగోలుకు పలు దేశాలు తీవ్ర ఆసక్తి చూపుతుండగా,




- మిగతా 2లో

## మమతా బెనర్జీ కారుపై దాడి

**పెన్ పవర్ డెస్క్:**పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఓ టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆమె వాహనాన్ని నిరసనకారులు చుట్టుముట్టారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కారుపై బురద చల్లడంతోపాటు చెప్పులు, రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం గూండాల

- మిగతా 2లో



# కాన్వాయ్ ఆపి.. ప్రకాశం బ్యారేజీని పరిశీలించిన సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ (ఆగస్టు 9) విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి ప్రవాహాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. విజయవాడలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని, తిరిగి ఉండవల్లిలోని తన నివాసానికి వెళుతున్న సమయంలో, మార్గమధ్యంలో తన కాన్వాయ్‌ను బ్యారేజీపై కొద్దిసేపు నిలిపివేశారు. బ్యారేజీ వద్ద నీటి లభ్యత, డెల్టాకు నీటి విడుదల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటివరకు 17.52 టీఎంసీల గోదావరి జలాలను విజయవంతంగా కృష్ణా నదికి తరలించినట్లు జలవనరుల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరోవైపు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదల కారణంగా ఇదే సీజన్‌లో సుమారు 521 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వృథాగా కలిసిపోయిందని తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు సమృద్ధిగా కృష్ణా నదికి చేరుతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి యాజమాన్యాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ నుంచి డెల్టాలోని వివిధ కాలువలకు మొత్తం 7,158 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 3,928 క్యూసెక్కులు, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 3,115 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 115 క్యూసెక్కుల చొప్పున నీటిని అందిస్తున్నట్లు వారు ముఖ్యమంత్రికి నివేదించారు.

## ఎడిటర్ వ్యూ

## ఏపీ, తెలంగాణ రాష్ట్రాలపై ఎల్ నినో ఎఫెక్ట్... నీటి ఇబ్బందులు తప్పవా?

ఎల్ నినో ప్రభావం తెలుగు రాష్ట్రాలపై పడుతోంది. ప్రాజెక్టులకు వరద నీరు చేరుతున్నప్పటికీ వాటిని వదిలే విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు పెద్ద టాస్క్ కానుంది. ఇప్పుడున్నపరిస్థితుల్లో సాగునీటికి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం లేదు. కేవలం తాగునీరు, పశువులకు మాత్రమే అందించగలుగుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎల్ నినో ఎఫెక్ట్ తో ఈసారి రెండు రాష్ట్రాలు రైతులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద నీరు చేరుతున్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోలేదు. అదే సమయంలో గేట్లు కూడా ఎత్తలేదు. దీంతో జలవిద్యుత్తు కూడా ఇప్పటి వరకూ శ్రీశైలం ఎడమ, కుడి జల విద్యుత్తు కేంద్రాల్లో ప్రారంభం కాలేదు.

**అనుకున్న స్థాయిలో...**

ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల వానలు కురిసినప్పటికీ అనుకున్న స్థాయిలో పడలేదు. దీంతో గోదావరికి కొంత వరద నీరు చేరినా అవి రైతులకు వ్యవసాయం కోసం చేరే అవకాశాలు కనిపించడం లేదు. గోదావరి, కృష్ణా నదుల్లో ప్రస్తుత్తం ఉన్న నీటి నిల్వలను సాగుకు వదిలే అవకాశం లేదని ఏపీ వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. కేవలం తాగునీరుకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తామని, అలాగే పశు వులకు అవసరమైన నీటిని అందించాలని ప్రభుత్వం నుంచి సాగునీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. ఎల్ నినో ప్రభావంతో రాయలసీమ, ఉత్తరాంధ్రలో కరువు చాయలు ఇప్పటికే అలుముకున్నాయని ప్రభుత్వం చెబుతుంది.

**సాగర్ ఆయకట్టు కింద...**

ఇక తెలంగాణలోనూ వానలు ఏపీతో పోల్చుకుంటే కొద్దిగా పరవాలేదు. జూరాల ప్రాజెక్టుకు నీరు చేరింది. గోదావరి నదికి వరద నీరు రావడంతో కొంత ఆయకట్టు కింద ఉన్న రైతులకు సాగు నీరు అందే అవకాశముంది. కాళేశ్వరం, మేడిగడ్డ, శ్రీరామ్ సాగర్ తో పాటు జూరాల ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఇంకా నీరు సాగుకు విడుదల చేయలేదు. ఇక నాగార్జున సాగర్ కు అయితే నీరు ఇంకా చేరక దాని ఆయకట్టు రైతులు వ్యవసాయపరంగా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ప్రభుత్వం సాగర్ జలాశయం వద్ద ఈ నెల 10న వరుణయాగాన్ని కూడా చేపట్టింది. అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వానలు కురుస్తున్నాయే తప్ప అది సాగుకు ఉపయోగం లేని వానలని అధికారులు చెబుతున్నారు. రైతులు మాత్రం కొంత భూగర్భ జలాలు నిండటంతో ఖరీఫ్ సాగును ప్రారంభించారు.

## రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం.. సరికొత్త కారిడార్‌పై భారీ ప్లాన్!

- మొదటి పేజి తరువాయి

మరాత్ ఖుస్నుల్లిన్ స్వయంగా వెల్లడించారు. రష్యా వార్తా సంస్థ 'టాస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక విషయాలను తెలిపారు.

కీలకమైన సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని ఖుస్నుల్లిన్ ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. ముఖ్యంగా, బోస్ఫరస్ జలసంధి, హర్మూజ్ జలసంధి వంటి అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన మార్గాలలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, వాటికి ప్రత్యామ్నాయంగా భూమార్గ రవాణా కారిడార్లను అభివృద్ధి చేయాలని రష్యా భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రపంచ చమురు వాణిజ్యంలో దాదాపు 25 శాతం, ఎల్ఎన్‌జీ రవాణాలో 20 శాతం హర్మూజ్ జలసంధి నుంచే జరుగుతుంది. ఈ మార్గాల్లో ఉండే ఉద్రిక్తతలు, ఇబ్బందులు తమ దేశ రవాణా వ్యవస్థపై ప్రభావం చూపకూడదనేది రష్యా వ్యూహంగా కనిపిస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా, రష్యా నుంచి బయలుదేరి తుర్క్‌మెనిస్థాన్, ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా భారత్‌కు చేరుకునేలా ఒక రైల్వే కారిడార్‌ను నిర్మించడం ఒక ఆచరణీయమైన మార్గంగా ఖుస్నుల్లిన్ పేర్కొన్నారు. అయితే, భారత్‌కు చేరువయ్యేందుకు ఏ మార్గమైనా తాము పరిశీలించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన కేవలం ప్రాథమిక అన్వేషణ దశలోనే ఉంది. రైల్వే మార్గం, ప్రయాణికుల రైలు సర్వీసులు, టికెట్ ధరలు లేదా ప్రాజెక్టు ప్రారంభ తేదీ వంటి వివరాలేవీ ఇంకా ఖరారు కాలేదని ఆయన తెలిపారు. ఈ రైల్వే కారిడార్ వాస్తవరూపం దాల్చితే రష్యాకు, భారత్‌కు ఇరు దేశాలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. సముద్ర మార్గాలపై పూర్తిగా ఆధారపడకుండా, హిందూ మహాసముద్రం వైపు తమ సరుకులను రవాణా చేయడానికి రష్యాకు ఇది మరో ముఖ్యమైన మార్గాన్ని అందిస్తుంది. అదే సమయంలో, మధ్య, దక్షిణాసియాతో రష్యాకు భూమార్గ కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుంది. భారత్‌కు కూడా ఈ కారిడార్ ద్వారా రష్యా, మధ్య ఆసియా దేశాలతో వాణిజ్య, రవాణా సంబంధాలు మెరుగుపడతాయి. ప్రజల రాకపోకలు పెరిగి పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. అయితే, ఈ ప్రతిపాదన ఆచరణలోకి రావడం అంత సులభం కాదు. ఈ మార్గం పలు దేశాల గుండా వెళ్లాల్సి ఉండటం, భారీగా మౌలిక సదుపాయాలు కల్పించాల్సి రావడం వంటి సవాళ్లు ఉన్నాయి. ముఖ్యంగా, రవాణా, భద్రత, సరిహద్దుల వద్ద సమన్వయం వంటి అనేక క్లిష్టమైన అంశాలు ఈ ప్రాజెక్టుతో ముడిపడి ఉన్నాయి. అయినప్పటికీ, ఇన్ని సవాళ్లు ఉన్నా, భారత్‌తో నేరుగా భూమార్గం ద్వారా కనెక్ట్ కావాలన్న రష్యా ఆలోచన వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దు... ఇరాన్‌పై దాడుల కోసమేనా.?

- మొదటి పేజి తరువాయి

దీంతో ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై కొత్త దాడులు ప్రారంభించనుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇరాన్‌పై మొదటిసారి దాడులు చేపట్టడానికి కొన్ని గంటల ముందు కూడా ఆ దేశం సైనికులకు ఇటువంటి ప్రకటనే చేసింది. దీంతో ఇప్పుడు కూడా పెద్ద స్థాయిలో దాడులు చేపట్టడానికి ఆ దేశ సైన్యం సిద్ధమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడుతుండడంతో దాడులను ఆపివేయాలని అమెరికా భావిస్తోంది. అయితే నెతన్యాహు (చీమ్ఖుఅఖుష్ట్రబ) మాత్రం యుద్ధం కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. అమెరికా సాయం లేకుండా సొంతంగా టెహ్రాన్‌పై విరుచుకుపడడానికి (Iౌతీఅనెవం ూఅ ×ఖుఅ) సైన్యం సన్నాహాలు కూడా ప్రారంభించినట్లు తెలిపాయి. ఇరాన్‌లోని కీలక నేతలు, ఐఆర్‌జీసీ అధికారులే లక్ష్యంగా దాడులు చేయడానికి ఇప్పటికే నెతన్యాహు సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ట్రంప్ శాంతి ప్రణాళికలను వ్యతిరేకించిన నెతన్యాహు.. ఇరాన్‌తో యుద్ధం ముగింపు, గాజాలో దాడుల నిలుపుదల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (ఇశీఖుశ్రీస ఎతీబఎజూ) ప్రతిపాదించిన

15 పాయింట్ల ప్రణాళికను నెతన్యాహు వ్యతిరేకించారు. గాజా విషయంలో అగ్రరాజ్య ప్రతిపాదనలను అంగీకరించబోమని.. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టేంతవరకు వెనక్కి తగ్గబోమని ప్రకటించారు.

**దాడులు చేస్తే.. ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్**

ఇజ్రాయెల్ మరోసారి తమపై దాడి చేస్తే.. తీవ్ర స్థాయిలో విరుచుకుపడతామని ఇరాన్ శనివారం హెచ్చరించింది. టెల్ అవీవ్‌లోని చమురు రిఫైనరీలు, కీలక కార్యాలయాలను లక్ష్యం చేసుకుంటామని పేర్కొంది. వ్యూహాత్మక హర్మూజ్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికాకు సూచించింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

## మమతా బెనర్జీ కారుపై దాడి

- మొదటి పేజి తరువాయి

చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు. బిర్జూ అనే టీఎంసీ కార్యకర్తను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు కస్టడీలో ఉన్న సమయంలోనే మృతి చెందాడు. తన భర్తను లాకప్‌లో కొట్టడం వల్లే ప్రాణాలు కోల్పోయాడని ఆయన భార్య ఆరోపించారు. ఈ క్రమంలోనే బిర్జూ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత బయల్దేరారు. ఆమె వెంట ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, డోలా సేన్ ఉన్నారు. మార్గమధ్యంలో నిరసనకారులు ఆమె వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ వ్యవహారం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

**పిల్లల భవిష్యత్తు కంటే మంత్రి పదవి ముఖ్యమేం కాదు: ధర్మేంద్ర ప్రధాన్**

"నా కారుపై చెప్పులు, బురద విసిరారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. నా తల పగిలిపోయి ఉండేది. ఇది ముమ్మాటికీ కుట్రే. నేను వస్తున్నానని పోలీసులకు ముందే చెప్పాను. అయినప్పటికీ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. నన్ను లక్ష్యంగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గూండాలను వాడుకుంటోంది" అని మమత ఆరోపించారు. అయితే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే మమత అక్కడికి వెళ్లారని భాజపా ఆరోపించింది. ఆమె రాకపై స్థానికులు నిరసన తెలిపారని పేర్కొంది.

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి కేసీఆర్ పరామర్శ.. రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందజేత

- మొదటి పేజి తరువాయి

అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను కేసీఆర్ స్వయంగా సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. నల్లబెల్లిలోని నివాసానికి చేరుకున్న కేసీఆర్, తొలుత సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. సుదర్శన్‌రెడ్డి అత్యంత సాదాసీదా జీవితం గడిపారని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంచి నేత అని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రకటించిన ఆర్థిక సాయంలో భాగంగా సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లల పేరున చెరో రూ.1 కోటి, ఆయన తల్లి అమృతమ్మ సంరక్షణ కోసం రూ.25 లక్షల చెక్కులను కేసీఆర్ అందించారు. పిల్లల చదువులు, భవిష్యత్తుతో పాటు కుటుంబ

సంక్షేమ బాధ్యతలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కేసీఆర్ రాక సందర్భంగా నల్లబెల్లికి బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసం వద్ద జనం కిక్కిరిసిపోవడంతో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చి కేసీఆర్ కాన్వాయ్‌కు దారి కల్పించారు. కేసీఆర్ వెంట పలువురు పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## బ్రహ్మోస్‌కు ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ.. కొనుగోలుకు క్యూ కడుతున్న దేశాలు!

- మొదటి పేజి తరువాయి

ఇప్పటికే కొన్ని దేశాలతో భారీ ఒప్పందాలు కూడా ఖరారయ్యాయి. 'ది వీక్' పత్రిక ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, ఈ క్షిపణి కొనుగోలుకు చర్చలు వేగవంతమయ్యాయి. 2022 జనవరిలో ఫిలిప్పీన్స్‌తో 375 మిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్న భారత్, ఆపరేషన్ సిందూర్ తర్వాత మరిన్ని విజయాలు సాధించింది. వియత్నాం సుమారు 629 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని ఖరారు చేయగా, ఇండోనేషియా కూడా 200 నుంచి 300 మిలియన్ డాలర్ల మధ్య విలువైన ఒప్పందాన్ని ఖరారు చేసుకుంది. యూరప్, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికాకు చెందిన డజనుకు పైగా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి వ్యక్తం చేస్తున్నాయి.

**ఆపరేషన్ సిందూర్‌తో పెరిగిన ప్రతిష్ఠ**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే), పాకిస్థాన్‌లోని కీలక ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా, భారత వాయుసేన విమానాలు అంతర్జాతీయ సరిహద్దు దాటకుండానే సుమారు 15 బ్రహ్మోస్ క్షిపణులను పాక్ సైనిక స్థావరాలపై ప్రయోగించాయి. ఈ దాడుల కచ్చితత్వం, తీవ్రత పాకిస్థాన్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా, పాకిస్థాన్ మోహరించిన చైనా నిర్మిత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను బ్రహ్మోస్ విజయవంతంగా ఛేదించడం ఒక కీలక పరిణామం. ఈ క్షిపణి దాడుల ధాటికి తట్టుకోలేకే పాకిస్థాన్ వెంటనే కాల్పుల విరమణకు పిలుపునిచ్చిందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామమే బ్రహ్మోస్‌పై ప్రపంచ దేశాలకు నమ్మకాన్ని పెంచింది.

**పెరిగిన ఉత్పత్తి.. భవిష్యత్ ప్రణాళికలు**

పెరుగుతున్న దేశీయ, అంతర్జాతీయ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని భారత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీలతో పాటు ఇటీవల లక్నోలో కొత్తగా ప్రారంభించిన ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి మొదలైంది. ప్రస్తుతం ఈ నాలుగు కేంద్రాల్లో నెలకు కనీసం నాలుగు క్షిపణులను తయారు చేసే సామర్థ్యం ఉండగా, దీనిని మరింత విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత నావికాదళంలోని ప్రతి ప్రధాన యుద్ధనౌక, వాయుసేనలోని ప్రతి ఫైటర్ జెట్‌ను బ్రహ్మోస్‌తో సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**బ్రహ్మోస్ ప్రస్థానం**

బ్రహ్మోస్ ప్రాజెక్టుకు 1997లో అంకురార్పణ జరిగింది. అప్పటి డీఆర్‌డీఓ చీఫ్ ఏపీజే అబ్దుల్ కలాం నేతృత్వంలోని ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భూమికి సమీపంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణి లోటును గుర్తించారు. ఈ క్రమంలోనే రష్యాతో కలిసి బ్రహ్మోస్ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. డీఆర్‌డీఓ, రష్యాకు చెందిన ఎన్‌పీఓ మషినోస్ట్రోయేనియా (చీూూ మీఖంష్ట్రఱఅశీర్‌తీశీఎవఅఱఖు) సంయుక్త భాగస్వామ్యంతో 'బ్రహ్మోస్ ఏరోస్పేస్' ఏర్పడింది. తొలినాళ్లలో 'పీజే-10' అనే కోడ్‌నేమ్‌తో అత్యంత రహస్యంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు. మరోవైపు, బ్రహ్మోస్‌లో కొత్త వేరియంట్ల అభివృద్ధిపై కూడా శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. నీటి అడుగున ప్రయోగించే సామర్థ్యమున్న వెర్షన్, తేలికైన మినీ వేరియంట్‌ను రూపొందించే పనులు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో బ్రహ్మోస్‌ను తయారు చేసి, తేజస్, ఎల్‌సీఏ ఎంకే 2 వంటి దేశీయ యుద్ధ విమానాలకు అనుసంధానించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.

## ఆదివాసీలతో కలిసి డప్పు కొట్టిన చంద్రబాబు.. ఉత్సాహంగా థింసా స్టెప్పులేసిన సీఎం

- మొదటి పేజి తరువాయి

సాధించాలనేది నా సంకల్పం" అని స్పష్టం చేశారు. ఒక రైతు పంట పండించినా, ఒక విద్యార్థి బాగా చదివినా, ఉద్యోగి నిబద్ధతతో పనిచేసినా అదంతా దేశ నిర్మాణంలో భాగమేనని ఆయన వివరించారు. "వ్యక్తిగతంగా విజయం సాధించడం కూడా దేశ నిర్మాణంలో భాగమే. పనిచేసే ప్రతి వ్యక్తీ సమాజానికి ఆస్తి. అందరి గెలుపే దేశం గెలుపు" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' దార్శనికతకు అనుగుణంగా, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విజన్‌తో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

## ప్రియాంక మృతి తీవ్రంగా కలచివేసింది.. నిందితులకు కఠిన శిక్షలు తప్పవు:

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి, ప్రియాంక మృతికి కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "తమ నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్‌తో ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్న నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చూస్తాం. ఈ విషయంలో ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. నిందితులపై కఠినమైన సెక్షన్లు నమోదు చేసి, వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ ఘటనకు కారణమైన యువకులను ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రియాంక కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన చంద్రబాబు, ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను అన్ని రకాలుగా ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. యువత బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, క్షణికావేశంలో చేసే తప్పులు ఇతరుల జీవితాలను నాశనం చేస్తాయని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

## దామచర్ల తానే రాజు తానే మంత్రి అనుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

దామచర్ల తీరుపై బాలినేని శ్రీనివాసరెడ్డి తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేయడంతో ఈ వివాదం మరింత ముదిరింది. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలై, ఆ తర్వాత జనసేనలో చేరిన బాలినేని శ్రీనివాసరెడ్డి.. ఎమ్మెల్యే దామచర్లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే దామచర్ల అరాచకాలు పెరిగిపోయాయి. తానే రాజు, తానే మంత్రి అన్నట్లుగా ఆయన వ్యవహరిస్తున్నారు. ఆయన తీరుతో సొంత పార్టీ టీడీపీ కార్యకర్తలే ఇబ్బందులు పడుతున్నారు" అని బాలినేని ఆరోపించారు. తమ వారిపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని, తప్పు చేయని తన వాళ్లను కాపాడుకోలేకపోతే తాను నాయకుడిగా ఉండి ఉపయోగం ఏంటని బాలినేని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటితో ఆగకుండా, ఎమ్మెల్యేపై నేరుగా అవినీతి ఆరోపణలు చేశారు. "ఇసుక, మైనింగ్, వైన్‌లో ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నాయి. ఆయనకు ప్రతిరోజూ మామూళ్లు అందుతున్నాయి. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే విచారణకు ఆదేశించాలి. అప్పుడే నిజానిజాలు బయటకు వస్తాయి" అని బాలినేని డిమాండ్ చేశారు. కూటమిలో పొత్తు ధర్మం పాటించాలనే ఉద్దేశంతోనే ఇన్నాళ్లూ తాము మౌనంగా ఉన్నామని, అయితే ఇకపై సహించేది లేదని ఆయన హెచ్చరించారు. "మా ఓపిక నశించింది. ఇకపై మేం, మా కార్యకర్తలు చూస్తూ ఊరుకోం. ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం," అని బాలినేని స్పష్టం చేశారు. ఈ బహిరంగ ఆరోపణలతో ఒంగోలులో కూటమి నేతల మధ్య విభేదాలు వీధికెక్కాయి. స్థానిక నాయకుల మధ్య మొదలైన ఈ పోరు, రాష్ట్రస్థాయిలో కూటమి నాయకత్వానికి కొత్త తలనొప్పిగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## రాజమండ్రి ప్రమాద ఘటనలో గాయపడిన ప్రియాంక మృతి

- మొదటి పేజి తరువాయి

ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్ అనే ఇద్దరు యువకులు ఆమె స్కూటర్‌ను ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. ఈ ఘటనలో ప్రియాంక తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజమండ్రిలోని స్థానిక ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. అక్కడ ఆమెను కాపాడేందుకు వైద్యులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఆమె కోలుకోలేకపోయింది. శుక్రవారం మధ్యాహ్నం 3:25 గంటలకు ప్రియాంక తుదిశ్వాస విడిచినట్టు కిమ్స్ వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులు దశ్వంత్, ఆండ్రూలను ఇప్పటికే అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కాగా, తన కుమార్తె మృతికి కారణమైన వారిపై సాధారణ ప్రమాద కేసు కాకుండా, హత్య కేసు నమోదు చేయాలని ప్రియాంక తండ్రి డిమాండ్ చేశారు. ఇది కేవలం ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని ఆయన ఆరోపిస్తున్నారు. పోలీసులు కూడా సీసీటీవీ ఫుటేజి పరిశీలించిన అనంతరం, కావాలనే ఢీకొట్టినట్టు గుర్తించారు. హత్యాయత్నం సెక్షన్లతో కేసును మరింత పకడ్బందీగా మార్చారు. ప్రియాంక స్వస్థలం తెలంగాణ లోని గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్ పూర్. ఆమె ఎంబీబీఎస్ అనంతరం రాజమండ్రిలో పీజీ చేస్తోంది. ఇప్పుడు ఆమె మృతితో స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# రమేష్ అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

**పెందుర్తి పోలీసులకు తల్లి లక్ష్మి ఫిర్యాదు**

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం / పెందుర్తి, ఆగస్టు 9:** రాతిచెరువు ప్రాంతానికి చెందిన పెదపాటి రమేష్ అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ ఆయన తల్లి పెదపాటి లక్ష్మి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మృతిపై కుటుంబ సభ్యులకు పలు అనుమానాలు ఉన్నాయని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

రమేష్ ప్రేమ వివాహం చేసుకున్నాడని, గతంలో అతని భార్య కుటుంబ సభ్యులతో విభేదాలు, ఘర్షణలు జరిగినట్లు ఆమె తెలిపారు. ఆగస్టు 8వ తేదీ అర్ధరాత్రి మృతికి కొద్దిసేపటి ముందు రమేష్ తన అన్న సాయితో ఫోన్‌లో మాట్లాడిన విషయాన్ని కూడా దర్యాప్తులో భాగంగా పరిశీలించాలని పోలీసులను కోరారు.

రమేష్ మృతికి అసలు కారణాన్ని నిర్ధారించేందుకు మృతదేహానికి పోస్టుమార్టం, ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఫోన్ కాల్ వివరాలు, సీసీటీవీ ఫుటేజీలు, ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలించి ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని కోరారు.



రమేష్‌ది సహజ మరణమా, ప్రమాదమా, ఆత్మహత్యా లేక ఇతర కారణాల వల్ల జరిగిందా అనే విషయాన్ని ఆధారాలతో తేల్చాలని లక్ష్మి పోలీసులను కోరారు. దర్యాప్తులో హత్యకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి వస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## మెగా హీరోలు ప్రయాణించిన కారు ఎవరిది!



**సోషల్ మీడియాలో వైరల్**

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 9:** టాలీవుడ్ అగ్రశ్రేణి నటులు రాంచరణ్ తేజ్, అల్లు అర్జున్ లు వినియోగించిన కారు గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో, అభిమానుల్లో విస్తృత చర్చ జరుగుతోంది. మంగళగిరి స్టేడియంలో జూన్ నెలలో జరిగిన ఏపీఎల్ మ్యాచ్ లో రాంచరణ్ ప్రయాణించిన ఏపీ 40 ఎల్ఈ 1 ల్యాండ్ క్రూయిజర్ కారులోనే ఆదివారం అల్లు అర్జున్ విశాఖ ఇన్ ఆర్బిట్ మాల్ లోని ఏఏఏ థియేటర్ల ప్రారంభోత్సవానికి రావడంతో ఆ కారు గురించి అనేకమంది ఇప్పుడు ఆరా తీస్తున్నారు. ఈ కారు మెగాస్టార్ చిరంజీవికి, ఆయన కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుది. మెగా కుటుంబ సభ్యులెవరు విశాఖ వచ్చినా గంటా వారికి ఆత్మీయ ఏర్పాట్లు చేస్తుంటారు. "ఇద్దరు హీరోలు ఒకే కారులో ప్రయాణించారు. అనుబంధం అంతర్గతంగా ఎప్పుడూ ఉంటుంది. అభిమానులు ఫ్యాన్ వార్ లు పక్కన పెట్టాలి" అని సోషల్ మీడియాలో ఇద్దరు హీరోలు ప్రయాణించిన కారు ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

## జలధార--జలహారతిలో ఏఎస్ఆర్ జిల్లా మూడు విభాగాల్లోనూ ప్రథమ స్థానం

**కలెక్టర్ టి. నిశాంతి నాయకత్వానికి దక్కిన గుర్తింపు**

**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, పెన్ పవర్, ఆగస్టు 9:** జల సంరక్షణ, నీటి వనరుల అభివృద్ధి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన జలధార--జలహారతి కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా సత్తా చాటింది. కార్యక్రమం అమలులోని మూడు కీలక విభాగాల్లోనూ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. అత్యధిక సంఖ్యలో పనులు చేపట్టడంలో, అత్యధిక నూతన నీటి నిల్వ సామర్థ్యాన్ని సృష్టించడంలో, జలధార--జలహారతి ద్వారా అత్యధిక ఆశించిన ఫలితాలను సాధించడంలో ఏఎస్ఆర్ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఒకేసారి మూడు విభాగాల్లోనూ అగ్రస్థానం సాధించడం జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. జిల్లా కలెక్టర్ టి. నిశాంతి అంకితభావంతో కూడిన నాయకత్వం, నిరంతర పర్యవేక్షణ ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది. కార్యక్రమం అమలుపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించిన కలెక్టర్.. పనులను సకాలంలో పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించడం, క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను సాధించడంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం, అధికారులకు నిరంతరం మార్గనిర్దేశం చేయడం ద్వారా లక్ష్య సాధనకు జిల్లా యంత్రాంగం కృషి చేసింది. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కలెక్టర్ టి. నిశాంతిని అభినందించారు. కార్యక్రమం విజయవంతంగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు మార్గనిర్దేశం చేసినందుకు ప్రశంసలు తెలిపారు. ఈ విజయం అన్ని శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, సంబంధిత భాగస్వాముల సమిష్టి కృషి ఫలితమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతానికి అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు. జలధార--జలహారతి కార్యక్రమం ద్వారా జిల్లాలో నీటి భద్రతను బలోపేతం చేయడంతో పాటు సాగునీటి సామర్థ్యం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అవకాశం ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా ఏఎస్ఆర్ జిల్లాలోని గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. నీటి సంరక్షణ, నీటి వనరుల అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తూ, సమన్వయంతో కూడిన, వినూత్నమైన, ఫలితాల ఆధారిత పాలన ద్వారా జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.



# ముంచంగిపుట్టులో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవము







- జడ్పీ చైర్ పర్సన్ సొంత నిధులతో విగ్రహాల ఏర్పాటు.
- ఆదివాసి దినోత్సవం లో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర.
- మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి.
- ఆదివాసి దినోత్సవములో పాల్గొన్న ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 09.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరిగాయి. ఆదివాసి ప్రపంచ దినోత్సవంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొటగుల్లి భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, జీసిసి మాజీ చైర్ పర్సన్ శోభ స్వాతిరాణి, ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం జిల్లా నేతలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మొదటగా ఉమ్మడి విశాఖ జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థినిలు, గిరిజన మహిళ ప్రజా ప్రతినిధులు మండల కేంద్రం నాలుగు రోడ్ల కూడలి నుండి గిరిజన దింస నృత్యంతో అంబేద్కర్ పార్కు వరకు వెళ్లి చెరువు సుందరి కరణ పనులు ప్రారంభించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ పార్క్ లో కళావేదికను, అంబేద్కర్ పార్కు ప్రహరీ నీ ప్రారంభించారు. జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన కొమరం భీం విగ్రహావిష్కరణ ఎమ్మెల్సీ కుంభ రవిబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అదేవిధంగా బిర్సా ముండ విగ్రహనీ గిరిజన ఉద్యోగుల సంఘం నేతలు ఆవిష్కరించారు. మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మాజీ జిసిసి చైర్పర్సన్ శోభ స్వాతిరాణి ఆవిష్కరించారు. అదేవిధంగా సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని మాత సావిత్రిబాయి పూలే ఆశయ సాధన సమితి కమిటీ సభ్యులు, అంబేద్కర్ ఆశయ సాధన సమితి కమిటీ సభ్యులు ప్రజా సంఘాల నాయకులు కలిసి ఆవిష్కరించారు. విగ్రహాల ఆవిష్కరణ ఘనంగా జరిగిన అనంతరం ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు దింస నృత్యంతో గిరిజన ఉద్యోగుల సంఘ భవనం ప్రారంభోత్సవానికి వెళ్లారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ గిరిజన ఉద్యోగుల సంఘం భవనాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఉద్యోగ సంఘం మండల అధ్యక్షుడు బజ్జంగి బాబురావు అధ్యక్షతన ఆదివాసి దినోత్సవ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి దినోత్సవం పురస్కరించుకుని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ.. ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు భాష జీవన విధానం ప్రత్యేకమైనదని ప్రపంచంలో నేటికి 30శాతం మంది ఆదివాసులు అడవుల్లోనే జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. గిరిజన చట్టాలు హక్కులు పరిరక్షణకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వాలు గిరిజనుల హక్కులు చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ.. ఆదివాసి దినోత్సవము యొక్క ప్రత్యేకతను వివరించారు. జీఓ నెంబర్ 3, 1/70 చట్టాన్ని గూర్చి క్లుప్తంగా వివరించారు. జీఓ నెంబర్ 3 పునరుద్ధారణకు, 1/70 చట్టం పటిష్టంగా అమలుకు ప్రభుత్వం కృషి చేయాలి అన్నారు. కొమరం భీం, జ్యోతిరావు పూలే, బిర్సముండా, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేసిన జడ్పీ చైర్ పర్సన్ కు అభినందించారు. అదేవిధంగా పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర అల్లూరి సీతారామరాజు జిల్లాలో కోట్లాది రూపాయలు నిధులు కేటాయించారని, అభివృద్ధి సంక్షేమానికి పరుగులు పెట్టించారని కొనియాడారు. ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ.. గిరిజన ఉద్యోగ భవన్ నిర్మాణానికి కృషి చేసినందుకుగాను జడ్పీ చైర్ పర్సన్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. అందరికీ ఆదివాసుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. గిరిజనుల అభివృద్ధి సంక్షేమం తన లక్ష్యమన్నారు. తనను జిల్లాస్థాయిలో పంపినందుకు గిరిజనుల రుణం తీర్చుకునే అవకాశం ఈ విధంగా కలిగిందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 39 మండలాల అభివృద్ధి, సంక్షేమానికి కోట్లాది రూపాయలు కేటాయించడం జరిగిందని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్ననన్నారు. కాగా జడ్పీ చైర్ పర్సన్ చేసిన పనులకు ఆదివాసి సమాజం హర్షం వ్యక్తం చేసింది. ఆదివాసి దినోత్సవము సందర్భంగా ఆదివాసులు ఆదివాసుల వస్త్రధారణతో సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జిమడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ నాని ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయ సాధన సమితి నాయకులు అనిల్ కుమార్, రామకృష్ణ, వివిధ రాజకీయ, ఉద్యోగ ఉపాధ్యాయ, ప్రజాసంఘాల నాయకులు, ఆదివాసి గిరిజన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# రామన్నపాలెంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు......



- గిరిజన సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు...
- విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కీలకం......
- ఆదివాసి సంస్కృతి,సంప్రదాయాలు,కలలను భావితరాలకు అందించాలి...
- అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్....

**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 09):** నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతి, కళలను ప్రతిబింబించేలా సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పాల్గొన్నారు. కలెక్టర్‌కు గిరిజన సాంప్రదాయ పద్ధతిలో పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, గిరిజన కళాకారులు నిర్వహించిన సంప్రదాయ కళారూపాల ప్రదర్శన ఆకట్టుకుంది. దింసా నృత్యం, తప్పెటగుళ్లు, చిటికెల భజనలు, కోలాటం తదితర సంప్రదాయ కళారూపాలతో నిర్వహించిన ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రదర్శించిన నృత్యాలు, కళారూపాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకమని అన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేకమైన ప్రతిభ, సామర్థ్యం దాగి ఉంటుందని, వాటిని గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. పిల్లల అభిరుచులు, ఆశయాలను తెలుసుకుని వారి కలలను సాకారం చేసుకునేలా తల్లిదండ్రులు అండగా నిలవాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. గిరిజన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించి, తనకు ఆతిథ్యం అందించిన నాతవరం మండల ప్రజలకు, అధికారులకు, ఉపాధ్యాయులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, గిరిజన పెద్దలు, కళాకారులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాడేరు ఐటీడీఏలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

* అమరవీరులకు ఘన నివాళులు.. ఆదివాసీ హక్కులు, సంస్కృతిని కాపాడుకోవాలని పిలుపు



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 9:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) సమావేశ మందిరంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, సంక్షేమాన్ని స్మరించుకుంటూ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందు గిరిజన విప్లవ వీరులు, స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాం మల్లుదొర విగ్రహాలకు పూలమాలలు వేసి అధికారులు నివాళులర్పించారు. అనంతరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు, గాం గంటందొర చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీబీకే పరిమళ మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, సంక్షేమాన్ని స్మరించుకుంటూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేసిన గిరిజన వీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, ఆదివాసీల హక్కుల సాధన కోసం అమరవీరులు చేసిన పోరాటాలను ఈ సందర్భంగా అధికారులు, నాయకులు గుర్తుచేసుకున్నారు. వారి స్ఫూర్తితో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలనాధికారి హేమలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎంసీడీ అధికారి డాక్టర్ ప్రతాప్, సమాచారశాఖ సహాయ ప్రాజెక్టు అధికారి, ప్రత్యేక ప్రచార విభాగం కె. వెంకటరావు, డిప్యూటీ తహశీల్దార్ (ఆర్ఓఎఫ్ఆర్) ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఐటీడీఏ అధికారులు, స్థానిక గిరిజన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కుల పై సామాజిక చైతన్యం పెంపొందించాలి.

* వినియోగదారులు హక్కులు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలి.
* చింతపల్లి గురుకుల కళాశాలలో జిల్లా వినియోగదారుల సమాఖ్య ఈగల్ టీం సంయుక్త అవగాహన కార్యక్రమం.




**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 9.** మండలంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల కళాశాలలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య మరియు ఈగల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులు చట్టాలు బాధ్యతలు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ జి.రామ్మూర్తి, అధ్యాపకులు బివి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు చిట్టిబాబు బూడిద సమాఖ్య ప్రధాన కార్యదర్శి రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు రమేష్ కిముడు ఈగల్ టీం అధికారులు జి కామేష్ ఎం కిరణ్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ కిమిడి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే వినియోగదారుల హక్కులు చట్టాలు మరియు బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. వస్తువులు లేదా సేవలు పొందేటప్పుడు నాణ్యతను పరిశీలించడం,బిల్లు తీసుకోవడం, సేవల్లో లోపం లేదా జాప్యం జరిగినప్పుడు ప్రశ్నించడం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. వినియోగదారులకు కల్పించిన చట్టపరమైన రక్షణలు, సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత వినియోగదారుల కమిషన్ను ఆశ్రయించే విధానం మరియు న్యాయం నష్ట పరిహారం పొందే అవకాశాల గురించి వివరించారు. విద్యార్థులు తాము అర్థం చేసుకున్న అవగాహనను కుటుంబ సభ్యులు, గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరవేసి వినియోగదారుల హక్కులపై సామాజిక చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈగల్ టీం అధికారులు జి కామేష్ ఎం కిరణ్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడటం వల్ల కలిగే ఆరోగ్య, విద్య కుటుంబ మరియు సామాజిక నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు గంజాయి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెడువాళ్లువాట్లకు ఆకర్షితుల కాకుండా విద్య క్రీడలు నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల వంటి వాటిపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ప్రతి యువకుడి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండల మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, ఏఎన్ఎం కళాశాల సిబ్బంది అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రక్తదానానికి యువత ముందుకు రావాలి

స్వచ్ఛంద రక్తదానంతో ప్రాణాలు కాపాడొచ్చు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్ ఆగస్టు 09 :**రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. రామా టాకీస్ వద్ద వాయుపుత్ర హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 32వ రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతను అభి నందించి, వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అత్యవసర సమ యాల్లో రక్తం అందక అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. సమాజంలో రక్త కొరత లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదాన కార్యక్ర మాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.
వాయుపుత్ర హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వరుసగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడం అభినం దనీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో శివశంకర్, గణేష్, స్థానిక జనసేన వార్డు అధ్యక్షులు, చంటి, రాజు, సతీష్ తదితరులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# స్వేచ్ఛాయుత బాల్యమే సృజనాత్మకతకు పునాది

'పిల్లలు వర్ధిల్లాలి' పుస్తక ఆవిష్కరణలో వక్తల అభిప్రాయం



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 9:** స్వేచ్ఛాయుతమైన బాల్యమే పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తుందని, అలాంటి విద్యా విధానమే భవిష్యత్ తరాలకు, దేశ అభివృద్ధికి దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'పిల్లలు వర్ధిల్లాలి' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.
వితపు బాలసుబ్రమణ్యం, సి.వి. కృష్ణయ్య రచించిన ఈ పుస్తకాన్ని శ్రీ ఈదర రవికిరణ్, ఐఆర్ఎస్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ అండ్ కమిషనర్, నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్, విశాఖపట్నం జోన్ ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు డా. ఎన్. చంద్రశేఖర్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.
వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకురాలు డా. కె. రమాప్రభ పుస్తకాన్ని పరిచయం చేశారు. పుస్తకంపై బాల వికాస ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ నరవ ప్రకాశరావు, 'బాలబాట' సంపాదకురాలు శ్రీమతి స్వరాజ్యం వెంకట రమణమ్మ, రచయిత, బాలల అంశాల క్షేత్రస్థాయి కార్యకర్త శ్రీ హరి వెంకట రమణ ఆప్తవాక్యాలు పలికారు. పుస్తకంలో ప్రస్తావించిన అంశాలకు సంఘీభావంగా కన్సర్న్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డా. పి.కె. జోస్, ఆంధ్ర విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు శ్రీ తుమ్మల సుధాకర్ రెడ్డి, ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ శ్రీ ఉమామహేశ్వరరావు, ఆసరా చారిటబుల్ సొసైటీ ప్రతినిధి శ్రీ ఎన్. సంజీవ్ కుమార్, వైజాగ్ ఎన్జీవో ఫోరం ప్రతినిధి శ్రీ ఎల్. ప్రజ్ఞాన్ కుమార్ తమ అభిప్రాయాలను వెల్లడించారు.
ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పిల్లలకు స్వేచ్ఛాయుతమైన, ఆనందదాయకమైన బాల్యాన్ని అందించడం సమాజం బాధ్యత అని అన్నారు. పిల్లల సృజనాత్మకత, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసానికి అనుకూలమైన విద్యా విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. బాలల సంక్షేమం, హక్కుల కోసం పనిచేస్తున్న సంస్థలు, వ్యక్తులతో పాటు తల్లిదండ్రులు కూడా 'పిల్లలు వర్ధిల్లాలి' పుస్తకాన్ని తప్పనిసరిగా చదవాలని సూచించారు.
కార్యక్రమంలో బాలలతో పనిచేస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు, సాహితీ స్రవంతి, ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, ఉపాధ్యాయులు, వైజాగ్ రీడ్స్ ప్రతినిధులు, ప్రత్యామ్నాయ విద్య కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబరాన్ని అంటిన.. ఆదివాసి దినోత్సవ సంబరాలు.

* ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలి.
* మండలంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 9.** ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణతో పాటు ఆదివాసీల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు సూచించారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి ఆఫీసు ప్రాంగణంలో ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవాన్ని అత్యంత వైభవంగా, కడు రమ్యంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్ష కార్యదర్శులు చల్లంగి ప్రసాద్, చింతల మధుబాబు మసాడ రాంబాబులు అధ్యక్షత వహించగా, జిల్లా కార్యవర్గం గెమ్మెలి మోహన్రావు, చింతర్ల సతీష్ కుమార్, సాగిన కోటి బాబు, పూజారి చిట్టిబాబు, భౌదు గంగరాజు, దేపూరు శశి కుమార్, కుడుముల వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్య,ఉపాధి ఆరోగ్యం సామాజిక అభివృద్ధి మరియు ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు యువత ముందుకు రావాలని కోరారు. ఆదివాసి వారసత్వాన్ని కేవలం ఒక తరం వరకు మాత్రమే పరిమితం చేయకుండా భవిష్యత్ తరాలకు కూడా గర్వంగా అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆదివాసీల హక్కులు ఆత్మగౌరవం సంస్కృతి పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆదివాసీ సమాజానికి ఒక ప్రత్యేకమైన సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు ప్రకృతితో ముడిపడిన జీవన విధానం తరతరాలుగా కొనసాగుతున్నాయి అన్నారు. అడవిని కేవలం జీవనాధారంగా చేసుకోవడం మాత్రమే కాక అడవితో ఆదివాసీలకు ప్రత్యేకమైన అనుబంధం ఉండి ఆదివాసీల జీవన విధానం ప్రపంచానికి ఎంతో ప్రత్యేకమైనదిగా ఉందని పేర్కొన్నారు. ఆదివాసీల జీవన విధానం జానపద గీతాలు, దింసా నృత్యాలు, సాంప్రదాయ వేషధారణ, ప్రకృతి ఆరాధన, సామూహిక జీవనం జీవన విధానం వంటి అంశాలు వారి సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. ఆధునికత వేగంగా విస్తరిస్తున్న సమయంలో కూడా యువతమ తమ మూలాలను, మాతృభాషను, ఆచారాలను సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్య ద్వారానే ఆదివాసీ యువత భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలదని ప్రతి కుటుంబం తమ పిల్లలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని సూచించారు. జీవో నెంబర్3 బదులుగా ప్రత్యామ్నాయ జీవోను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనులకు కేటాయించిన ఉద్యోగాలను గిరిజనులతోనే భర్తీ చేయాలని, గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ జీవోని తక్షణమే ప్రకటించాలని కోరారు. ఈ వేడుకలలో విద్యార్థులు యువత ఉత్సాహంగా పాల్గొని ఆదివాసి ఐక్యతను చాటారు. ఆదివాసి సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను దింసా నృత్యాలను ప్రదర్శించి సందడి చేస్తూ ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లోచలి రామకృష్ణ, భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మొట్టడం రాజబాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రీమల నవభారత్, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, కంకిపాటి బాబులు, వైయస్సార్సీపి నాయకులు జల్లి సుధాకర్, పెట్ల రాజబాబు, డి ఎల్ ఓ సభ్యులు వెంకాయమ్మ, కాసులమ్మ, ప్రధానోపాధ్యాయులు సాగిన రామరాజు పడాల్, కే అర్జున్, ఎం చిన్నయ్య పడాల్ భారీ సంఖ్యలో ఆదివాసి గిరిజనులు పాల్గొన్నారు.

## గూడెం కొత్తవీధిలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 9:** మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గిరిజన సంఘాలు, గిరిజన ఉద్యోగ సంఘాలు, జేఏసీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పార్టీలకతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గిరిజనులు సంప్రదాయ దుస్తులు ధరించి, సాంప్రదాయ నృత్యాలు, వాయిద్యాలతో మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజనుల నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో జీకే వీధి ఎంపీటీసీ రేమెలా రాజేశ్వరి, ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రాజుబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిబాబు, లోసెల రామకృష్ణ, కొర్ర మల్లేశ్వరరావు, కొర్ర బలరాం, కంకిపాటి నారాయణ, లకే రామచంద్రుడు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మహిళల సృజనాత్మకతకు 'సిటీ కుక్' వేదిక



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 09 :**మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారి సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు 'సిటీ కుక్ ఛాంపియన్ షిప్' వంటి కార్యక్రమాలు దోహదపడతాయని జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. రేడియో సిటీ ఆధ్వర్యంలో కేఏ పాల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'సిటీ కుక్ ఛాంపియ న్షిప్ సీజన్--3' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వంటకాలను సరికొత్త రుచులతో తయారు చే స్తూ పోటీల్లో పాల్గొన్న మహిళల ప్రతిభను ఎమ్మెల్యే అభినం దించారు. వంటకాల తయారీలో మహిళలు చూపిన సృజ నాత్మకత ఆకట్టుకుందని, ఇలాంటి పోటీలు మహిళలకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. పోటీల ఉద్దేశం కేవలం విజేతలను ఎంపిక చేయడం మాత్రమే కాదని, ఒకే వేదికపై మహిళలు కలిసి మెలిసి పాల్గొని స్నేహభావాన్ని పెంపొందించుకోవడం కూడా ముఖ్యమని అన్నారు. గెలుపోటముల కంటే ప్రతిభను పంచుకోవడం, పరస్పర ప్రోత్సాహం, ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మహిళలను ప్రోత్సహించేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న రేడియో సిటీ నిర్వాహకులను అభినందించిన ఆయన, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో సదరన్ ఇన్స్టిట్యూట్ అధినేత సతీష్ పొన్నం, జనసేన పార్టీ యువ నాయకులు గణేష్, సందీప్, రేడియో సిటీ నిర్వాహకులు, జనసేన నాయకులు, కార్యకర్త లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం రాష్ట ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ పల్లా శ్రీనివాసరావు.



**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు09** పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజవర్గంలో పలు వార్డులలో తీవ్రమైన అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సుమారు 57 మంది బాధితులకు 47 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పార్టీ కార్యాలయం పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన లో 300 మంది లబ్ధిదారులకు సుమారు మూడు కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందించామని అన్నారు .
ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 86వ వార్ ఇంచార్జ్ నల్లూరి సూర్యనారాయణ, 73వ వార్డ్ ప్రెసిడెంట్ సింగూరి అనంతు, 66వ వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు, 64 వ వార్డు అధ్యక్షుడు కొవ్వూరు హరికృష్ణ, 73వ వాడు క్లస్టర్ ఇంచార్జ్ బలగా బాలు నాయుడు, 69 వార్డు క్లస్టర్ ఇంచార్జ అక్కిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సస్పెక్ట్ షీట్ హోల్డర్లకు పోలీసుల కౌన్సిలింగ్ -- శ్రమదానం ద్వారా సామాజిక మార్పుకు శ్రీకారం




**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 09**
విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ , డీసీపీ క్రైమ్స్ మరియు ఏసీపీ క్రైమ్స్ ఆదేశాల మేరకు, సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జి.డి. బాబు , లా అండ్ ఆర్డర్ ఇన్స్పెక్టర్ వాసన్ నాయుడు పర్యవేక్షణలో దువ్వాడ, స్టీల్ ప్లాంట్ , గాజువాక క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్ హోల్డర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు . కార్యక్రమంలో సౌత్ క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జి.డి. బాబు , హరికృష్ణ , దువ్వాడ ఎస్ఐ సత్తిబాబు , స్టీల్ ప్లాంట్ ఎస్ఐ , సంబంధిత పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సస్పెక్ట్ షీట్ హోల్డర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తూ, గతంలో తెలిసో తెలియకో చేసిన నేరాల కారణంగా తమపై సస్పెక్ట్ షీట్లు తెరవబడిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇకపై ఎటువంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా సమాజంలో మంచి పౌరులుగా, గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడినా, చట్ట ప్రకారం వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పోలీసులు స్పష్టంగా హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులకు, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.కౌన్సిలింగ్ అనంతరం మేము సైతం కార్యక్రమంలో భాగంగా పోలీస్ సిబ్బంది మరియు సస్పెక్ట్ షీట్ హోల్డర్లు కలిసి శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

సస్పెక్ట్ షీట్ హోల్డర్లు స్వచ్ఛందంగా శ్రమదానం కార్యక్రమంలో పాల్గొనడం వారి ప్రవర్తనలో సానుకూల మార్పుకు సంకేతంగా పోలీసులు హర్షం వ్యక్తం చేశారు .

ఇకపై కూడా నేరాలకు దూరంగా ఉంటూ, సమాజహిత కార్యక్రమాల్లో పాల్గొని, మంచి పనులు చేస్తూ గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించాలని వారికి సూచించారు.

నేర నియంత్రణతో పాటు నేరాలకు పాల్పడే వ్యక్తుల్లో మార్పు తీసుకురావడం, వారిని సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడం పోలీసుల ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.




## కాకారపాడు జంక్షన్ వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ...!

వాహనదారులు విధిగాహెల్మెట్ ధరించాల్సిందే .




**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 9:** ద్విచక్ర వాహనాలను నడిపే వారంతా విధిగా హెల్మెట్ ధరించాల్సిదేనని కొయ్యూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. కొయ్యూరు మండలంలోని కాకరపాడు హైవే రోడ్డు సమీపంలో ఆదివారం స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ మాట్లాడుతూ...సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ ఐ కిషోర్ వర్మ లు ఆదేశాల మేరకు ఇక్కడ ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్నట్టు తెలిపారు. లైసెన్స్ లేకుండా ప్రయాణం చేయడం, ట్రాపిక్ నిబంధనలు పాటించక పోవటంతో పాటు మైనర్లు కు వాహనాలను ఇచ్చి ప్రమాద సంఘటలు కొని తెచ్చుకోవటం ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలిపారు.ఈ వాహన తనిఖీల్లో ఏపీఎస్పి పోలీసులు పాల్గొన్నారు.

## వి. వి . విద్యాలయం విధులోకి కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు , బోధినేతర సిబ్బంది



**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 09**
విశాఖ విమల విద్యాలయం - ఉక్కునగరం పాఠశాలలో గత 17 సంవత్సరాల నుండి పనిచేస్తున్నటువంటి 8 మంది కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు , బోధినేతర సిబ్బందిని గత సంవత్సరం కొన్ని అనివార్య కారణాలవల్ల స్కూలు మూతపడిన సందర్భంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులు కూడ ఉద్యోగాలు కోల్పోయారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, గాజువాక ఎంఎల్ ఏ పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపి భరత్ సహకారంతో ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలగా తిరిగి పున:ప్రారంభించారు . రెగ్యులర్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి కొనసాగించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకొని లేదు.ఈ విషయాన్ని పల్లా శ్రీనివాసరావుని కలిసి, వినతిపత్రం ఇచ్చిన వెంటనే, వారు స్పందించి, వీరు గత 17 సంవత్సరాలుగా కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ, ఎంతో అంకితభావంతో పాఠశాల అభివృద్ధి కృషి చేశారని, కొనసాగించాల్సిందిగా జిల్లా కలెక్టర్ అభిషక్త్ కిషోర్ , డి ఈ ఓ ప్రేమ కుమార్ తో మాట్లాడి, తక్షణమే వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులతో చర్చించి స్కూల్లో పనిచేయడానికి అవకాశం కల్పించారు. పల్లా శ్రీనివాసరావుకి చిరు సత్కారం చేశారు. సమస్యపై పూర్తి సహాయసహకారాలు అందించిన మొల్లి పెంటిరాజు కి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఇతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉపాధ్యాయులు మురళీకృష్ణ, ఖాదర్ బాషా, కవిత టీచర్, రోజా టీచర్, విజయ్ శేఖర్, బసా అజయ్ రెడ్డి, రత్న తదితరులు పాల్గొన్నారు .

## 2029 ఎన్నికలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలి -పల్లా శ్రీనివాసరావు

**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,ఆగస్టు 09**
మహా విశాఖ నగర పాలక సంస్థ 86వ వార్డు రాజీవ్ నగర్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. స్థానిక వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరవాత వార్డులో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను స్థానిక ప్రజలకు వివరించారు. కార్యక్రమం భాగంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నియోజకవర్గం లో కోట్లాది రూపాయలతో అన్ని వార్డులలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టమని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కేవలం 86వ వార్డులోనే 17 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సుమారు 20 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వార్డులో గల రాసాలమ్మ కాలనీ విశ్వబ్రాహ్మణ సంఘం నుండి, కొత్త



రసాలమ్మ కాలనీ మరియు పెద్దయాతపాలెం నుండి సుమారు 50 మంది ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమక్షంలో నూతనంగా పార్టీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డ్ జనసేన నాయకులు కాదా శ్రీను, వార్డు క్లస్టర్ ఇంచార్జి వేగుంట శ్రీనివాస్, నాయకులు జగదీశ్, రమేష్,గణపతి,నాగార్జున, వెంకటేష్, సుబ్బయ్య, అరిపాక లక్ష్మణరావు, రమణారావు, నాయుడు, సాగి శ్రీను, సింహాద్రి, పాలవల్లి, నూక అప్పారావు, తలారి శ్రీను,రామకృష్ణ రాజు, అప్పలస్వామి,లోవరాజు, తులసిరావు,గోవింద్ ప్రదన్, మదీనా వల్లి, పీరుబాబా,రుక్మిణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యూరు లో ఆదివాసీల దినోత్సవం విజయవంతం...!



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 9:** కొయ్యూరు మండల కేంద్రమైన రాజేంద్రపాలెం లో గిరిజన సంఘం మండల నాయకుడు సలు మూర్తి సూరిబాబు ఆధ్వర్యంలో ఆదివాసీ ఐక్య సంఘాల నాయకులు ,ఆదివాసీ హక్కుల సాధనకు వామపక్ష పార్టీ పిలుపునిచ్చిన ఆధ్వర్యంలో ఆదివాసీల ఉద్యమం విజయవంతమైంది.

ఈ మేరకు వ్యాపార వర్గాలు, ఇతర దుకాణాలు , రోజు వారీ వ్యాపారుల వారంతా స్వచ్ఛందంగంగా ఈ కార్యక్రమంకు సహకరించారు. గిరిజన నాయకులు ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి, 1/70 చట్టం హక్కుల వర్తింప జేయాలని జీ ఓ నంబర్ 3 ప్రత్యామ్నాయ చట్టాన్ని ఏర్పాటు చేసి ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో నూరు శాతం ఉద్యోగ నియమాలను ఇవ్వాలని నినాదాలు చేస్తూ కార్యక్రమం విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు జెఎసి నాయకులు సురబోయిన అశోక్ లాల్, శ్యామల వరలక్ష్మి, పాటి శేఖర్,జీరా దేవీల్లాల్, అచ్యుత్, రమేష్ , గొడ్డేటి మహేష్, పలువురు ఉద్యోగ సంఘ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 100% ఉద్యోగ రిజర్వేషన్ కల్పించవలసిందే.

**ఆదివాసి దినోత్సవం పతాకావిష్కరణ లో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్.**

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 9.**ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చాలని, ఆదివాసి ప్రాంతంలో నూటికి నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేయాల్సిందేనని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని తాజంగి కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నూటికి నూరు శాతం ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేయాల్సిందేనని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా గ్రామసభ అనుమతులు లేకుండా బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి రహస్య సర్వేలు జరుగుతున్నాయని వాటిని తక్షణమే ఆపాలని, హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎందరో త్యాగాల ఫలితంగా రాజ్యాంగబద్ధంగా వచ్చినటువంటి గిరిజన చట్టాలను, జీవోలను ప్రస్తుతం పరిపాలిస్తున్న ప్రభుత్వాలు కాలరాయడానికి ప్రయత్నం చేస్తున్నాయని ఇది ఏ మాత్రం గిరిజన సమాజం ఉపేక్షించేది కాదని అన్నారు. ఏళ్ల తరబడి హక్కులు చట్టాల అమలకై గిరిజనులు పోరాటం చేస్తున్నప్పటికీ,అమలు చేయాల్సినటువంటి ప్రభుత్వాలు దున్నపోతు మీద వర్షం కురుస్తున్నట్టుగా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ మధ్యకాలంలో గిరిజన ప్రాంత గుండెకాయ లాంటి 1/ 70 చట్టాన్ని సవరించాలని సుప్రీంకోర్టులో గిరిజ నేతరులు వేసిన పిటిషన్ను వ్యతిరేకిస్తూ గిరిజనులు చేస్తున్న పోరాటాన్ని చూస్తూ కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలియనట్లు వ్యవహరించడం గిరిజనులకు ఎటువంటి న్యాయం చేస్తున్నారని భావించాలని ప్రశ్నించారు. అందుకోసం రాజ్యాంగబద్ధంగా



వచ్చినటువంటి ఉద్యోగ రిజర్వేషన్ జీవోలు 100కు 100% కల్పిస్తూ జీవో నెంబర్ 3 స్థానంలో ప్రత్యామ్నాయ జీవో ఏర్పాటుకు ఆర్డినెన్స్ జారీ చేయాలని, గిరిజన ప్రాంతంలో 1/ 70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని,అక్రమ మైనింగ్ లు, ప్రాజెక్టులు ఆపివేయాలని లేనిపక్షంలో భవిష్యత్తులో గిరిజన ప్రాంత ప్రజలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకంగా ఉధృతమైన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాజంగి పర్యాటక వికాస్ చైర్మన్ శంకర్రావు, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు కోర్ర హేమంత్ కుమార్, రామాలయం సేవా సంఘం ప్రెసిడెంట్ పెనుమాల క్రాంతి కుమార్, తాజంగి మాజీ ప్రెసిడెంట్ పెనుమాల కాంతమ్మ, తాజంగి యువ కాంగ్రెస్ నాయకులు రీమల రాజేష్, తాజంగి మాజీ పీసా కమిటీ సభ్యులు మొస్య నారాయణరావు, లంబసింగి పంచాయతీ పీసా కమిటీ సభ్యులు నాగరాజు, తదితర నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## వడ్లపూడి లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,ఆగస్టు 09**
జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి లో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు . కార్యక్రమం లో వార్డు, నియోజకవర్గం వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మాటూరి రాము,వార్డు తెలుగు యువత అధ్యక్షుడు కర్రి కృష్ణ,వార్డు ఐటీడీపి అధ్యక్షుడు గోకాడ భాస్కర్,వార్డు తెలుగు యువత ఉపాధ్యక్షుడు సంద్రన రాజేష్, వార్డు తెలుగు యువత సెక్రటరీ శ్రావణ్,కోట అప్పలరాజు, కర్రి వాసు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఎమ్మెల్యే పల్లా నాయకత్వం లో నియోజకవర్గం అభివృద్ధి, నారా చంద్రబాబు, నారా లోకేష్ నాయకత్వం లో ఆంధ్ర రాష్ట్రము అభివృద్ధి చెందుతుందని అన్నారు.

## పిచ్చికుక్క దాడిలో వైసీపీ మండల కార్యదర్శికి గాయాలు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 9:** మండలంలోని దామనపల్లి పంచాయతీ దొడ్డికొండ గ్రామంలో పిచ్చికుక్కల సంచారం ఆందోళన కలిగిస్తోంది. ఆదివారం గ్రామంలో సంచరిస్తున్న ఓ పిచ్చికుక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి వంతల చంటిబాబుపై ఒక్కసారిగా దాడి చేసింది. తప్పించుకునేలోపే ఆయన కాలిపై బలంగా కరవడంతో తీవ్ర గాయమైంది.కుక్క దాడిలో గాయపడిన చంటిబాబు కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు కర్రలతో అక్కడికి చేరుకుని కుక్కను తరిమికొట్టారు. విషయం తెలుసుకున్న వైసీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, ముఖ్య నాయకులు కంకిపాటి నారాయణ, రీమేల బాలకృష్ణ, పాతుని లక్ష్మణ్ తదితరులు హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. రక్తస్రావంతో ఉన్న చంటిబాబును వెంటనే వాహనంలో ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందించడంతో పాటు యాంటీ రేబీస్ టీకా వేశారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో పిచ్చికుక్కల సంచారాన్ని నియంత్రించి, ప్రజల భద్రతకు చర్యలు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వానికి క్రెడిట్ చోరీ అలవాటు. పుష్పశ్రీవాణి

**కురుపాం ఆగస్టు 09 పెన్ పవర్.**కురుపాం మండల కేంద్రంలో నూతన ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆదివారం నాడు మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి మీడియా సమావేశం నిర్వహించారు.నిన్న ఆస్పత్రుల ప్రారంభోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు పాముల పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ,గ్రీన్,బ్లూ రంగులు కనిపిస్తే కూటమి ప్రభుత్వానికి దడపుడుతోందన్నారు.క్రెడిట్ చోరీ చేయడం కూటమి ప్రభుత్వానికి అలవాటైపోయిందని.అంతేకాక
వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కురుపాం,గుమ్మలక్ష్మీపురం రెండు ఆస్పత్రులకు శంకుస్థాపన చేసి 95 శాతం పనులు పూర్తి చేశామన్నారు.పూర్తయిన భవనాలకు రంగులు మార్చి ప్రారంభించడానికి కూటమి ప్రభుత్వానికి రెండేళు పట్టింది ప్రారంబానికి 15,000 రూపాయలు పట్టు చీర కొనిపించుకునే శ్రద్ధ పూర్తయిన హాస్పిటల్స్ ప్రారంభించడానికి ఎమ్మెల్యేకు 2 ఏళ్ళు పట్టడం దౌర్భాగ్యం అన్నారు.కురుపాం నియోజకవర్గంలో సంక్షేమం,అభివృద్ధి వైసీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని,వైసీపీ నిర్మించిన భవనాలకు ఎమ్మెల్యేలు రిబ్బన్ కట్ చేస్తున్నారు.మంత్రి అచ్చెన్నాయుడు వచ్చిన రోడ్లు కూడా వైసీపీ హయాంలో నిర్మించినవేనని పుష్పశ్రీవాణి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# యర్రవరం విద్యుత్ సబ్ స్టేషన్ ను సందర్శించిన ఏ డి ఈ మాదర్స్ సయ్యద్.

- రైతులకు 9 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తామని ఏ డి ఈ హామీ.






**ఏలేశ్వరం, పెన్ పవర్, ఆగస్టు 9:** మండల పరిధిలోని యర్రవరం గ్రామంలో గల విద్యుత్ సబ్స్టేషన్ ను ఎ డి ఈ మాదర్స్ సయ్యద్ ఆదివారం సందర్శించారు. యర్రవరం గ్రామంలో 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్ సిరిపురం గ్రామ రైతాంగానికి సాగునీరు అందడం లేదని, విద్యుత్ సరఫరా సరిగాలేదని శనివారం సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి రైతులు నిరసన తెలిపారు. ఈ మేరకు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ మాదర్స్ సయ్యద్ విద్యుత్ సబ్స్టేషన్కు విచ్చేసి విద్యుత్ సరఫరా లాగ్ బుక్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాదర్స్ సయ్యద్ మాట్లాడుతూ రైతులు నెల రోజులుగా తమ వ్యవసాయ బోర్లకు పేరవరం సంబంధించి విద్యుత్తు అందించడం లేదని తెలిపారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రికార్డులు తనిఖీ చేయగా ఈ నెలలో 3వ తేదీ , 7వ తేదీన పేరవరం గ్రామానికి సంబంధించి వ్యవసాయ బోర్లకు త్రీ ఫేజ్ కరెంటుకు రెండు రోజులు అంతరాయం కలిగిందని అన్నారు. రెండు పెద్ద చెట్లు విరిగి విద్యుత్ లైన్ పై పడిన కారణంగా ఒకరోజు సాంకేతిక సమస్యతో ఏడో తేదీన మాత్రమే రైతులకు 9 గంటలు విద్యుత్ అందించలేకపోయామని,మిగిలిన 28 రోజులు విద్యుత్ సరఫరా 9గంటలు యధావిధిగా కొనసాగిందని తెలిపారు. ఉన్నతాధికారుల సూచనలతో విద్యుత్ సబ్స్టేషన్ పరిశీలించమని రైతులకు నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్తు సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. ఏడీఈ వెంట ఏ ఈ బి.సూర్యనారాయణ, ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

## పెద్దాపురం మరిడమ్మ జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు





**పెద్దాపురం, పెన్ పవర్ ఆగస్టు 9:** పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాకినాడ జిల్లా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ ఎబిజి తిలక్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ వై. ఆర్. కె. శ్రీనివాస్,ఎస్సైలు,పోలీసు సిబ్బంది జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.జాతరలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లు,ఆలయ పరిసరాలు,రద్దీ ప్రాంతాలు,పార్కింగ్, ట్రాఫిక్ను పోలీసులు నిరంతరం పర్యవేక్షించారు. దొంగతనాలు,చైన్ స్నాచింగ్లు,పిక్పాకెటింగ్,ద్విచక్ర వాహనాల చోరీలకు అవకాశం ఉన్న నేపథ్యంలో మైక్లు,ఆడియో ప్రకటనల ద్వారా భక్తులను అప్రమత్తం చేశారు. భక్తులు తమ విలువైన వస్తువులు, మొబైల్ ఫోన్లు,నగలు,వాహనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.వృద్ధులు,చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జాతర ప్రశాంతంగా జరిగేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

## జనార్ధన స్వామిని దర్శించుకున్న అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పద్మశ్రీ దంపతులు




**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 09;**నారద ప్రతిష్టిత అత్యంత మహిమాన్వితమైన ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామివారిని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ రామచంద్రపురం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పద్మశ్రీ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు సాదరంగా ఆహ్వానించారు. స్వామివారి దర్శనానంతరం అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. నారద మహర్షి ప్రతిష్ఠితమైన జనార్ధన ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె అన్నారు.


# జి.శివడలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకలు.



- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి.
- ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

**కురుపాం ఆగస్టు 09 పెన్ పవర్.**కురుపాం మండలం జి.శివడ గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొనగా,జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి,కలెక్టర్ డా. ప్రభాకర్ రెడ్డికి గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అడవితల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి అక్కడ ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే,కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి, విద్యార్థులనులు ప్రదర్శించిన సంప్రదాయ ధింసా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల నృత్య ప్రదర్శనలను ఎమ్మెల్యే,కలెక్టర్ ఆసక్తిగా తిలకించి అభినందించారు. గిరిజన యువతీ యువకులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడంతో వేడుకల ప్రాంగణం ఆదివాసీ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ. ఆదివాసీల సంస్కృతి,సంప్రదాయాలు,ఆచార వ్యవహారాలు దేశ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకలని అన్నారు. తరతరాలుగా వస్తున్న ఆదివాసీ కళలు,సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గిరిజనుల అభివృద్ధి,సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో విద్య,వైద్యం,మౌలిక వసతులతో పాటు యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఆదివాసీ సంస్కృతి,సంప్రదాయాలను పరిరక్షిస్తూభావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధికారులు,ప్రజాప్రతినిధులు,గిరిజన నాయకులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు,కూటమి నాయకులు,కార్యకర్తలు,గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోలపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్





**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రయాణించకుండా చూడడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు కాకినాడ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.ఆటోల్లో వెనుక వైపు, డ్రైవర్కు ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకుని ప్రయాణించరాదని పోలీసులు సూచించారు. పెద్దలకు 3ం1, పాఠశాల విద్యార్థులకు 6ం1 పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకోరాదని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ కుడివైపు డోర్ను ఎల్లప్పుడూ మూసి ఉంచాలని, ఇరువైపులా బ్యాక్సైడ్ మిర్రర్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.
అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.ఈ ప్రత్యేక డ్రైవ్లో ట్రాఫిక్–1 సీఐ ఎన్. రమేష్తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరిస్తేనే సురక్షిత ప్రయాణం



కాకినాడ ట్రాఫిక్ పోలీసులు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 9:** రోడ్డు ప్రమాదాల నివారణ, ద్విచక్ర వాహనదారుల ప్రాణ భద్రతే లక్ష్యంగా కాకినాడ జిల్లా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్–2 పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం.ఎస్.ఎన్. రాజు ఆధ్వర్యంలో వివిధ ట్రాఫిక్ జంక్షన్ల వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. హెల్మెట్ ధరించడం కేవలం ట్రాఫిక్ నిబంధన పాటించడం మాత్రమే కాదని, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే అత్యంత ముఖ్యమైన రక్షణ చర్య అని వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వాహనదారులకు వివరిస్తూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.“హెల్మెట్ పోలీసుల కోసం కాదు.. మన ప్రాణాల కోసం. హెల్మెట్ ధరిద్దాం.. సురక్షితంగా ఇంటికి చేరుదాం” అని పోలీసులు పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు జిల్లాలో నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## గొల్లప్రోలులో భారీ కార్డన్ అండ్ సెర్చ్





- 58 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- మత్తు పదార్థాలు, నాటు సారా, అక్రమ మద్యం కోసం విస్తృత తనిఖీలు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: పోలీసులు

**పెన్ పవర్ ప్రతినిధి (గొల్లప్రోలు),, ఆగస్టు 09:**శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు గొల్లప్రోలు గ్రామంలో పోలీసులు భారీ కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాకినాడ సబ్డివిజన్ ఇన్చార్జి అడిషనల్ ఎస్పీ కిషోర్కుమార్ పర్యవేక్షణలో పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఈ తనిఖీలు చేపట్టారు.
గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగప్ప చెరువు ప్రాంతాన్ని పోలీసులు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, అనుమానాస్పద ప్రాంతాల్లో అణువణువూ గాలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించడంతో పాటు పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.
ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, నాటుసారా, అక్రమ మద్యం నిల్వలు, బెల్ట్ షాపులపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

58 బైక్లు స్వాధీనం

తనిఖీల్లో సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు లేని మొత్తం 58 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.
గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే వారి వివరాలను తెలుసుకోవాలని కోరారు. గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాల విక్రయాలు, నాటుసారా తయారీ లేదా అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పోలీసులు స్పష్టం చేశారు.
ఈ తనిఖీల్లో గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ, పిఠాపురం టౌన్ ఎస్సై లోకేష్, యు.కొత్తపల్లి ఎస్సై వెంకటేష్ తదితరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ సంక్షేమ హాస్టల్స్ కి దోమతెరలు పంపిణీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ






**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 09**:–గోకవరం మండలం నందుగల సాంఘిక సంక్షేమ హాస్టల్స్ నందు దోమ తెరల పంపిణీ కార్యక్రమం జరిగినట్లు జి. కొత్తపల్లి పి. హెచ్. సి వైద్యులు డా. తిరన్ తెలిపారు.మండలం లో గోకవరం సంఘీక సంక్షేమ హాస్టల్ సంజీవయ్యానగర్, ఎస్.టి.పోస్టుమెట్రిక్ బాలుర మరియు బాలికల హాస్టల్, వీరలంకపల్లిలో గల డా. బి. ఆర్.అంబేద్కర్ గురుకుల వసతిగృహము, కామరాజుపేట సాంఘీక సంక్షేమ బాలికల హాస్టల్, మరియు భూపతిపాలెం గురుకుల వసతి గృహము మల్లవరం నకు దోమతెరల పంపిణీ జరిగినట్లు ఆయన తెలిపారు.హాస్టల్స్ నందు విద్యార్థినీ విద్యార్థులు ఈ దోమతెరలు వాడుట వల్ల దోమకాటు బారిన పడకుండా రక్షిశీనుచకొనవచ్చునని తద్వారా సీజనల్ జ్వరాలైన మలేరియా డెంగ్యూ బారిన పడకుండా రక్షణ కల్పించుకొనుటకు ఉపయోగపడునని తెలిపారు.స్థానిక సంజీవయ్య నగర్ నందు గల సాంఘిక సంక్షేమ హాస్టల్ నందు పిల్లలకు ఏవిధంగా తెరలు వాడాలో వైద్య సిబ్బంది డిమాన్ స్ట్రేషన్ చేసి చూపించారు.ఈ పంపిణీ కార్యక్రమం లో ఎమ్. పి. హెచ్. ఏ లు పవన్, రమణ, ఆచారి, నాగేశ్వరావు లు పాల్గొన్నారు.?

## గోదావరి ముంపుప్రాంతాల్లో పర్యటించినచైల్డ్ రైట్స్ కమిషన్,





**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.9**

ఇటీవలవచ్చిన గోదావరివరదలుకారణంగా ముంపునకుగురైన,వరదభాదితులు ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్,బాలలహక్కులపరిరక్షణ కమిషన్, సభ్యులబృందం,పర్యటించారు. పేరంటాపల్లి,తది తర,గ్రామాల్లోఆదివారం ఏపీఎస్సీపీసీఆర్ సభ్యులు ఉండవల్లిగాంధీబాబు,డా.ధోని శ్రీనివాసమూర్తి,చల్ల మధుసూదనరావు,సందర్శించి,బాలబాలికలతోవారి తల్లిదండ్రులతోమాట్లాతూ,టీకాలు వేయించారా,లేదా అనిఅడిగి తెలుసుకున్నారు.అనంతరం,అంగన్,వాడీ కేంద్రంనుండిపిల్లలకుపాలు,గుడ్లు,బాలమృతం,చిక్కి లుపంపిణీపై,ఆరాతీశారు. పిల్లలనుక్రమంతప్పకుండా బడికిపంపించాలని,కోరారు.బాలబాలికలనుఎలాంటి పరిస్థితుల్లోనూబడిమానిపించవద్దని,కోరారు.తల్లికి వందనంపథకం,ద్వారాఅందరికీ, తల్లికివందనంనగదు, పడ్డాయాలేదాఅంటూ, అడిగితెలుసుకున్నారు.ఆశకా ర్యకర్తతోమాట్లాడారు.తల్లిదండ్రులుపిల్లలను,చదువు మానిపించినా,పనిలోపెట్టడడం, బాల్యవివాహాలుచేసి నాచట్టప్రకారంనేరమని,ఎవరైనాఅలాచేసిన,యెడల వారిపైతగుచర్యలుతీసుకుంటామనిహెచ్చరించారు. విద్యతోనేఆదివాసీలఅభ్యున్నతి, సాధ్యమని,పిల్లల ఉన్నతచదువులుపూర్తిచేస్తే,వారేమీజీవితాలకు,వెలుగుదివ్వెలు,అవుతారని,ఆదివాసీలకు,సూచించారు.

## ఆధ్యాత్మిక సేవలకు కుడిపూడి రూ.10 వేల వితరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 9:** స్థానిక రాజేంద్రనగర్‌లో శ్రీ దానవాయి బాబు ఉత్సవాల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమానికి తనవంతుగా రూ.10,000 ఆర్థిక సహకారాన్ని అందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తా యని ఆయన పేర్కొన్నారు. శ్రీ దానవాయి బాబు ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. నిర్వాహకులను అభినందించారు.

# విద్యే బాలికల విజయానికి ఏకైక ఆయుధం





- **ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో రంపచోడవరం డీఎస్పీ పి. అష్రాఫ్ అలీ**
- **నెల్లిపూడి కస్తూరిబా పాఠశాలలో వేడుకలు.. విద్యార్థినులకు పుస్తకాలు, రాత సామగ్రి పంపిణీ**

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 9:**ప్రస్తుత పోటీ ప్రపంచంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే విద్యలో ముందంజలో ఉండాలని రంపచోడవరం డీఎస్పీ పి. అష్రాఫ్ అలీ అన్నారు. విద్యే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గంగవరం మండలం నెల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర కుమార్, గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి విద్యార్థినులతో వేడుకలు నిర్వహించారు. అనంతరం బాలికలకు వివిధ రకాల పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి డీఎస్పీ అష్రాఫ్ అలీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఎలాంటి ఆకర్షణలకు లోనుకాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని అన్నారు. బాలికలకు నేడు అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలంటే విద్య, నైపుణ్యాలు ఎంతో అవసరమని తెలిపారు.ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పోటీ తత్వాన్ని అలవర్చుకుని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.అడ్డతీగల సీఐ గజేంద్ర కుమార్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ బాలికలు ప్రతిభ కనబరచాలని, తమలోని నైపుణ్యాలను మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో గంగవరం ఎస్సై వెంకయ్యతో పాటు పోలీసు సిబ్బంది జగదీష్, అప్పలరాజు, సరోజిని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సింహాచల్ నగర్ లో చెత్త డంపింగ్ పై స్థానికుల ఆందోళన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 9:**పేదలు, బడుగు వర్గాలు అధికంగా నివసించే క్వారీ ఏరియా 49 వ వార్డు సింహాచలం నగర్, రాజేశ్వరి నగర్, సుబ్బారావు నగర్, సున్నం బట్టి వీధి శివారు ప్రాంతాల్లో చెత్తాచెదారాలకు డంపింగ్ యార్డ్ గా మారడం స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తం అవుతుందని నగరపాలక సంస్థ మాజీ స్టాండింగ్ కౌన్సిల్ చైర్మన్ బర్రె కొండబాబు అన్నారు. గత కొన్నేళ్లు గా నగరంలోని చెత్తాచెదారం తోపాటు సమీప గ్రామాలైన కోలమూరు, కాతేరు, పంచాయతీల నుంచి ప్రతి రోజు వందల టన్నుల చెత్తాచెదారాన్ని, సెప్టిక్ ట్యాంక్ మలమూత్ర వ్యర్థాలను ,ఆసుపత్రి వ్యర్థాలను, బిల్డింగ్ వ్యర్థాలను , బయో, వ్యవసాయ వ్యర్థాలను ట్రాక్టర్లతో టన్నులు కొద్ది డంపింగ్ చేస్తున్నారన్నారు.

ఇక్కడ చెత్త వేయవద్దని చాలా సంవత్సరాలుగా ప్రజా ప్రతినిధులకు, అధికారాలకు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోక పోవడంతో చెత్త ను తరలిస్తున్న వాహనాలను స్థానికలతో కలిసి శనివారం బర్రె కొండబాబు నిలిపి వేశారన్నారు. చెత్తను ఇక్కడ ఎవరు వేయమ న్నారని పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను బర్రె కొండబాబు నిలదీయగా రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కోలమూరు పంచాయతీ కార్యదర్శి లు వేయమ న్నారని సమాధానం ఇచ్చారు. దాంతో కొండబాబు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ వ్యర్థాలను డంపింగ్ చేయడం వల్ల క్వారీ చుట్టుపక్కల వేల కుటుంబాల నివాసం ఉండే ఈ ప్రాంతాల్లో భయంకర మైన దుర్గంధం వ్యాపిస్తుందని, పరిసర ప్రాంతాలు విషపూరితమ వుతున్నాయని , కలరా, మలేరియా, డయేరియా, ఫైలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని స్థానికులు ముఖ్యంగా పసిపిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ గోతులను పూడ్చులని తాను 2011లో హైకోర్టులో పిల్ వేసి న్యాయ పోరాటం చేస్తున్నానని తెలిపారు.

తన పిల్ కు సంబంధించి హైకోర్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చైర్మన్ గా తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ను సభ్యులుగా చేర్చి 8 మంది తో కమిటీ వేసిందన్నారు. హైకోర్టు ఆర్డర్ కు వ్యతిరేకంగా ఇక్కడ చెత్తాచెదారాన్ని డంపింగ్ చేయడం వల్ల పంచాయతీ కార్యదర్శి తో సహ అధికారులు కోర్టు ధిక్కరణ గురవుతారని , ఇదే విధంగా కొనసాగితే గనుక వారు ఇబ్బందులకు పడాల్సి వస్తుందని బర్రె హెచ్చరించారు. వ్యర్థాల డంపింగ్ వల్ల ఈ ప్రాంతంలో భూమి, గాలి విషపూరితం అయ్యాయని భూగర్భ జలాలు కూడా విషపూరిత మవుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతంలో పేదలు ఎస్సీలు, ఎస్టీలు, బలహీన వర్గాలు నివసిస్తున్నారనన్నారు. పేదలు నివసించే ప్రాంతం కావడంతోనే ఇక్కడ చెత్తతో పాటు సెప్టిక్ ట్యాంక్ మలమూత్ర వ్యర్థాలు కూడా డంపింగ్ చేస్తున్నారని ఇకనుంచి చెత్త వాహనాలు ఇక్కడకు రాకూడదని తాను పేదల పక్షాన పోరాటానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. చెత్త డంపింగ్ వల్ల క్వారీ ప్రాంతంలో వేల కుటుం బాలు అనారోగ్యం స్థానికుడు లక్ష్మీనారాయణ పాలవుతున్నారన్నారు.

ఈ ప్రాంతంలో సింహాచల నగరు, సన్నశీబట్టి వీధి, వాసులకు నిత్యం దుర్వాసన వ్యాపిస్తోంది. గతంలో కోలమూరు, కాతేరు గ్రామ పంచాయతి అధికారులకు చెత్తను వేయొద్దని చెప్పమన్నారు. అయితే అధికారులు పట్టించుకోకపోవడం వల్ల వాహనాలను నిలిపివేశా మన్నారు.

## యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**రాజమహేంద్రవరం, పెన్, పవర్, ఆగస్టు 9:**యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం స్థానిక దానవాయిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద, ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలు జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గట్టి నవతారకేష్ ఆధ్వర్యంలో, యువ నాయకులు పాల్గొని జెండా ఎగరవేశారు. స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, బోడ వెంకట్, ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

అధికార ప్రతినిది కొవ్వూరు శ్రీనివాస్, ఐల శేషగిరి, మహిళా అధ్యక్షురాలు చామర్తి లీలావతి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర సీనియర్ నాయకులు చింతాడ వెంకటేశ్వరరావు, ఇజ్జరోతు సత్యనారాయణ, కాపు చిన్న వీరభద్రరావు, కంచర్ల పండు, ఎన్ బుజ్జిబాబు, జాఫర్, పోసు, రమేష్, పవన్ సర్దార్, షణ్ముఖ, అశోక్, ప్రేమ్, ప్రతాప్, సంపత్, జబ్బర్, రఫి, నందు, బచ్చు బుజ్జిబాబు, తదితర యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. .

## ఘనంగా ప్రపంచఆదివాసి,దినోత్సవం



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.9:**ప్రభుత్వంఅధికారికంగా,ప్రపంచఆదివాసి,దినోత్స వాన్ని,గ్రామపంచాయితీ,కార్యాలయాల్లో ఏజెన్సీ గ్రామాల్లోమండలకేంద్రాలలో ఆదివారం ప్రపంచ ఆదివాసి,దినోత్సవం ,జెండానుఘనంగా ఆవిష్కరణ,చేశారు.రాష్ట్రంలోకూటమిప్రభుత్వంకుఆదివాసిచట్టాలపై, ఆదివాసిబిడ్డలపై,ఉన్నగౌరవందీనికి, నిదర్శనమని,మండలజడ్పిటిసివాళ్ళరంగారెడ్డి,టిడిపి పార్టీమండలప్రధాన కార్యదర్శిపాయంరామారావు కొనియాడారు.ఈకార్యక్రమానికి అతిథులుగా టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు బొర్రానరేష్ కుమార్,వచ్చి ప్రపంచ ఆదివాసిదినోత్సవం,కార్యక్రమానికి,టిడిపిపార్టీతరుపున సంఘీభావంతెలిపారు.ఈకార్యక్రమంలోసవలం రాజేంద్ర ప్రసాద్,బీరక సూర్యప్రకాష్,రావు,ముత్యాల చంద్రశేఖర్, తదితరులుపాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితుల కోసం ప్రత్యేక లోక్ అదాలత్ ఏర్పాటు చేయాలి



**జిల్లా న్యాయ సేవల అథారిటీకి బాలు అక్కిస వినతి**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 9:**పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పెండింగ్‌లో ఉన్న పునరావాస, పునఃస్థాపన (ఆర్అండ్ఆర్) క్లెయిమ్‌లు, వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్ ఏర్పాటు చేయాలని హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ బాలు అక్కిస కోరారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం రంపచోడవరం ఐటీడీఏలో తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవల అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా న్యాయ సేవల అథారిటీ కార్యదర్శి శ్రీలక్ష్మి కి బాలు అక్కిస వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 1,000 ఆర్అండ్ఆర్ కేసులు, క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొంటూ, నష్టపరిహారం, పునరావాస ప్రయోజనాలు, ఇళ్లు, ప్లాట్లు, అర్హత, బకాయిల చెల్లింపుల వంటి సమస్యలను వేగంగా పరిష్కరించాలని కోరారు.జిల్లా న్యాయ సేవల అథారిటీ, పోలవరం ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ శాఖ తదితర విభాగాల సమన్వయంతో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తే నిర్వాసితులకు సత్వర న్యాయం అందుతుందని బాలు అక్కిస వివరించారు.వినతిపై స్పందించిన జిల్లా న్యాయ సేవల అథారిటీ కార్యదర్శి, ప్రత్యేక లోక్ అదాలత్ ఏర్పాటుకు సంబంధించి అనుమతి కోసం ఈ ప్రతిపాదనను హైకోర్టుకు పంపిస్తామని హామీ ఇచ్చినట్లు బాలు అక్కిస తెలిపారు.

# ఆదివాసీ హక్కులు, సంప్రదాయాలను కాపాడుకోవాలి





**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 9:** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుర్కనకొట్ట జూవిగూడెం గ్రామంలో ఆదివాసీ సంప్రదాయాల నడుమ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆదివాసీ నాయకుల సమక్షంలో గ్రామ పూజారి మూర్రం తమయ్య, మూర్రం నరేష్ పటేల్, మూర్రం రామయ్య, మూర్రం జోగయ్యలు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు వేక రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసీల సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివాసీలకు గుండెకాయ లాంటి ముఖ్యమైన ప్రభుత్వ ఉత్తర్వులు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో పటిష్టంగా అమలు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీ చట్టాలు, సంప్రదాయాలను కాపాడేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కుంజా శ్రీను, వేక లెనిన్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కుంజా బాలు, మూర్రం పిడగయ్య, పుసం రాఘవయ్య, కుంజా శ్రీను, కుంజా ప్రసాద్, మూర్రం జంగలరాజు, మూర్రం నాగయ్య, తుర్రం పండు, మూర్రం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండలవ్యాప్తంగాప్రపంచఆదివాసి దినోత్సవం





-ఆదివాసిగిరిజన,సంఘాలనాయకులు

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.9**
ప్రతికా,ప్రకటనలుమాకొద్దు,ఏజెన్సీలోఆదివాసీలకు వందశాంతం ఉద్యోగనియామకచట్టంకావాలని,1/70 చట్టపరిరక్షణముఖ్యం,అంటూప్రపంచఆదివాసి దినోత్స వంసభలో,ఆదివాసీసం ఘాలనాయకులుడిమాండ్,చేశారు.ప్రపంచఆదివాసిదినోత్సవంసందర్భంగాఆదివాసి సంఘాలఐక్యవేదికఆధ్వర్యం లోమండలవ్యాప్తంగామరి యు,ఆదివాసిగ్రామాల్లోఘనంగాఆదివాసిజెండా ఆవిష్కరణలు,చేయడంజరిగింది.మండలంలోని రేఖపల్లి,గ్రామసచివాలయప్రాంగణంలోఆదివారం ఆదివాసిగిరిజన, సంఘాలనాయకులు ,పెద్దఎత్తున ప్రపంచఆదివాసిదినోత్సవం సభను,ఘనంగాజరుపు కోవడంజరిగింది .ఆదివాసిసంఘాలనాయకులుమా ట్లాడుతూఆదివాసిహక్కులుచట్టాలనుఅమలుచే యడంలోపాలక,ప్రభుత్వాలుసవతితల్లి,ప్రేమను చూపడంతోఉన్నచట్టాలనుతుంగలోతొక్కాలనిచా స్తున్నాయని,ఇదేవిధం గావ్యవహరిస్తే,ఆదివాసిసం ఘాలనాయకులు ,ఉప్పెనలాకదిలి,పెద్దఎత్తున,పోరు బాటనడుతుందని,హెచ్చరించారు.రెండు,మూడు సంవత్సరాలుగా జీవోనెంబర్,3పైపాలకప్రభుత్వాలు ప్రతికాప్రకటనలకుమాత్రమే పరిమితంఅవుతున్నా యని,పునరుద్ధరించి ,చట్టంచేయడంలోచిత్తశుద్ధి,చూ పడంలేదని, ఆవేదనవ్యక్తంచేశారు.ప్రస్తుతంఆదివాసిల భూములకురక్షణగాఉన్నటువంటి1/70చట్టాన్ని నిర్వీ ర్యంచేయాలని,కొంతమంది కుట్ర దారులుకేసులువేస్తుం టేఆచట్టాన్నికాపాడడం కోసంసుప్రీంకోర్టులో పిటిషన్, వేయకుండాప్రభుత్వంచోద్యంచూస్తుందని,పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంస్పందించి,ఆదివాసిహక్కులు చట్టాలనుఅమలుచేయడంలోముందుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలోమండల ఎంపీపీ,జడ్పిటిసి, ఎంపీటీసీలు,సర్పంచులు ,పీసాకమిటీ సభ్యులు,ఆది వాసిసంఘాలనాయకులు,ప్రజాఉద్యోగ,సంఘాలనా యకులు,తదితరులుపాల్గొన్నారు.

## తంటికొండలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం పెన్ పవర్ ఆగష్టు 09:**-అహింసే ఆయుధంగా స్వాతంత్రం తెచ్చిన మహానుభావుడు, భారతరత్న జాతిపిత అయినటువంటి మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు. టిడిపి మండల నాయకులు, గోకవరం మాజీ ఎంపీపీ డివివి సూర్య నారాయణ ( డబల్ మీసాలు )తనయుడు స్థాపించినటువంటి విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జాతిపిత గాంధీ విగ్రహాన్ని స్థాపించిన సీతారామకృష్ణ ఎమ్మెల్యే నెహ్రూ అభినందించారు. .ఈ కార్యక్రమంలో టీడీపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము, గోకవరం సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్న దొర, మండల పార్టీ అధ్యక్షులు పిల్ల చంటిబాబు,క్లస్టర్ ఇంచార్జ్ పురంశెట్టి శివాజీ,నియోజవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు బత్తుల సత్తిబాబు, భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గళ్ళ రాము, మండిగ గంగాధర్, తంటికొండ గ్రామ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు నాగం వెంకటపతి, గుండా శివ,గుబ్బలమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆచంట రాజు, కొత్తపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దిండి రాజు జగ్గంపేట నియోజకవర్గం ఐటిడిపి అధ్యక్షులు ఉంగరాల గణేష్, గోకవరం ప్రభుత్వ ఆస్పటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ లు పిట్ట అరుణ్, అల్లాడ అరుణ కుమారి, దళిత నాయకుడు పల్లా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల లో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం...







**అడ్డతీగల,పెన్ పవర్, ఆగస్టు 09:** మండల కేంద్రమైన అడ్డతీగల లో ఆదివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా అడ్డతీగల ఆశ్రమ పాఠశాలలో రంపచోడవరం డిఎస్పి అశ్రుఫ్ ఆలీ మరియు అడ్డతీగల సీఐ ఎం .గజేంద్ర కుమార్, ఎస్సై బి. వినోద్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు పెన్నులు, పెన్సిల్, స్కేలు సుమారు 200 మంది హై స్కూల్ ,కాలేజ్ విద్యార్థినిలకు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి అశ్రుఫ్ ఆలీ మాట్లాడుతూ విద్యార్థులంతా మంచి చదువులు చదివి ఉన్నతమైన పదవులు అవరోదించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరుతీసుకురావాలని అన్నారు. అలానే మహిళల భద్రతకు పటిష్టమైన చట్టాలు ఉన్నాయని, దీనిపై ఈగల్ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందని మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురి అయినట్లయితే తక్షణమే పోలీసులను ఆశ్రయించాలని డీఎస్పీ తెలిపారు. అనంతరం విద్యార్థినులు చేత కేక్ కట్ చేయించారు. అనంతరం విద్యార్థినిలు గిరిజన సంప్రదాయ నృత్యాలను, మరియు దిమ్మిస నృత్యాన్ని ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలానే ఆదివారం ఆదివాసి భవన్లో ఆదివాసి దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంస్కృతి ,సంప్రదాయాల గురించి పలువురు వక్తలు వివరిస్తూ, ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలని, ప్రతి ఆదివాసీ యువకుడు మంచి విద్యను అభ్యసిస్తూ అత్యంతమైన స్థానాలను అవరోధించాలని, ఏ ఒక్కరూ కూడా చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని వివరించారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీన ఆదివాసీ దినోత్సవం ఘనంగానిర్వహించుకుంటున్నామని అలానే ఈ సంవత్సరం కూడా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంప్రదాయ నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమానంతరం అడ్డతీగల పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది పాల్గొన్నారు.

## మండలంలో గ్రామ గ్రామాన ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం



**వై రామవరం, పెన్ పవర్, ఆగస్టు 9:** ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా మండలంలో గ్రామ గ్రామాన ఆదివాసి దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

మండలంలో యార్లగడ్డ గ్రామంలో ఆదివాసి దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు,గాం గంటన్నదొర, మల్లు దొర చిత్రపటాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటరమణారెడ్డి, లింగారెడ్డి, పలువురు నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దేవరమడుగులలో నిర్వహించిన ఆదివాసి దినోత్సవ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కాంతారెడ్డి ఆదివాసి జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ప్రతి గ్రామంలో ఆదివాసీలు ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా జెండాలను ఎగురవేశారు.

## బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి




**జీలుగుమిల్లి,, పెన్ పవర్, ఆగస్టు 9 ;** కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను నిరసించడానికి సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఏలూరు జిల్లా సిపిఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఆదివారం మార్పు కోసం సిపిఐ ఆధ్వర్యంలో మండలంలోని లంకలపల్లి, కామయ్యపాలెం, జీలుగుమిల్లి, అంకంపాలెం, రౌతు గూడెం, ములగలంపల్లి గ్రామాలలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు ఆరవ తేదీ నుండి 15వ తేదీ వరకు పాదయాత్రలు, ఆగస్టు 17 తేదీ నుండి 28 వరకు ప్రజా సంఘాల ప్రచార ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు .ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుదించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని అన్నారు. మహిళా రిజర్వేషన్లను తక్షణం అమలు చేయాలని అన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించి దళిత ఆదివాసులపై దాడులను నిలిపివేలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు కొప్పుల నాగరాజు, ద్వారకాతిరుమల సిపిఐ మండల కార్యదర్శి జి బాల యేసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిద్దు, నాయకులు కే శ్రీను, కే వీరభద్రం, కొక్కిరిగడ్డ ఆనందరావు, పురేటి పెద్ద కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 9;** మానవతా దృక్పథంతో ఓర్సు శ్రీనివాస్ కి 75 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు పోలవరం ఎమ్మెల్యే సిర్రి బాలరాజు తెలిపారు .ఆదివారం కనకాపురం గ్రామంలో ఓర్సు శ్రీనుకి అందించారు. జాతీయ రహదారి విస్తరణలో సర్వేలో ఓర్సు శ్రీను నివాసం నమోదు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందే అవకాశం లేకపోవడంతో ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బండారు అనిల్, కొప్పుల శ్రీకాంత్, సొంటి రామకృష్ణ, నేలటూరి మోహన్ ,బండారు సత్యనారాయణ, సిరి బత్తుల స్వామి, గణేష్, కుంజ రమేష్ తదితరులు పాల్గొన్నారు.ఐ

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ భారీ ర్యాలీ

- ర్యాలీలో ఆకట్టుకున్న ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగష్టు 9:**ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తూర్పు గోదావరి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్తానిక ఆర్ట్స్ కళాశాల నుండి కంబాల చెరువు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కె.ఎన్. జ్యోతి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ లో గిరిజనుల సాంస్కృతిక వారసత్వం,సంప్రదాయాలు, రాజ్యాంగబద్ధ హక్కులు సమగ్ర అభివృద్ధి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె ఎన్ జ్యోతి తెలిపారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై నినాదాలు చేశారు. “ఆదివాసీ సంస్కృతి -- అందరి సంపద”, “గిరిజన హక్కులు కాపాడుదాం”, “దేశీయ జ్ఞానాన్ని గౌరవిద్దాం”, “అడవి -- ఆదివాసీ జీవనాధారం”, “సమాన హక్కులు -- సమగ్ర అభివృద్ధి” వంటి నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఆదివాసీ కళా సంస్కృతిని ప్రతిబింబిస్తూ సంప్రదాయ వేషధారణలో కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పులు, తుడుములు గిరిజన వాద్యాల నాదంతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆదివాసీ సమాజం గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పాయి. ఈ కళా ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకుడు ఎస్. గన్నయ్య, ప్రొఫెసర్ మల్లి భాస్కర్ రావు, కే. నారాయణరావు, గరికపాటి సురేష్, ఎస్.ఎస్. చంద్రరావు, ఎం. వీరభద్రరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com